నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 24-9-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:46 పేజీలు:6 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

పేపరు లీకు
చదువరికి బ్రేకు
పందకు కేకు.
స్టూడెంట్స్ గెల్పు
ప్రజాస్వామ్య గెల్పు
జెన్ జీల కాలం.
కూలని కోట
పెద్దల తేటమాట
కథల ఊట.
పాలిమర్ నోట్లు
నానవు చిరుగవు
ప్లాస్టిక్ నిషేధం.
ఇంధన రంగం
భారత ధనాగారం
ఆర్థిక అశ్వం.

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనాథు

ఏసీ పేలిన ఘటనలో
చనిపోయిన శిశువులు !
కారణమేదైతేనేం
మనుషులార పశువులు !
రిమ్స్ ఆస్పత్రి ఘటనపై
జరపండి విచారణ !
పునరావృతం కాకుండ
పెట్టండి ఆచరణ. !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హానికర ఉత్పత్తుల ప్రచారంపై రాష్ట్రపతి ముర్ము కీలక వ్యాఖ్యలు

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 23: సినీ నటులు తమకున్న ప్రజాదరణను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఆరోగ్యానికి హాని కలిగించే ఉత్పత్తులను ప్రచారం చేసే ముందు వారు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని సూచించారామె. అయితే.. ముర్ము వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో చర్చలు జోరందుకున్నాయి. హానికరమన్న ప్రొడక్ట్స్‌ను ప్రచారం చేయొద్దని చెబుతున్నప్పుడు.. వాటి తయారీ, విక్రయాలపై ప్రభుత్వాలు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పలువురు నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.

కాగా.. నిన్న(మంగళవారం) 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల కార్యక్రమం లో భాగంగా.. రాష్ట్రపతి ముర్ము సినీ ప్రముఖులను ఉద్దేశించి మాట్లాడారు. ముఖ్యంగా యువత, పిల్లలపై సినీ తారలు చూపే ప్రభావాన్ని ప్రస్తావించారు. ప్రముఖుల మాటలు, చేతలు కోట్లాది మంది ప్రజల నిర్ణయాలను ప్రభావితం చేస్తాయన్న ఆమె.. వాటిని సమాజహితానికి మాత్రమే ఉపయోగించాలని సూచించారు. 'రియల్ స్టార్స్ వెలుగును పంచాలి.. చీకటిని కాదు' అన్న ఆమె వ్యాఖ్యలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆరోగ్యానికి హాని కలిగించే ఉత్పత్తులకు ప్రచారకర్తలుగా వ్యవహరించడానికి ముందు వారు సామాజిక బాధ్యతను గుర్తుంచు కోవాలని ఆమె పరోక్షంగా సూచించారు.

అయితే.. రాష్ట్రపతి వ్యాఖ్యలకు పలువురు మద్దతు తెలుపగా.. మరి కొందరు సోషల్ మీడియా వేదికగా ప్రశ్నలు లేవనెత్తారు. ముఖ్యంగా చిన్నారులు, యువతపై సినీ తారల ప్రభావం ఎక్కువగా ఉంటుందని, అందువల్ల ప్రముఖుల ప్రకటనల విషయంలో కాస్త జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని కొందరు పేర్కొన్నారు. అసలు సమస్య సెలబ్రిటీల ప్రచారంతోనే ముగిసిఎోదని ఇంకొందరు కామెంట్ చేశారు. ఒక ప్రొడక్ట్ ఆరోగ్యానికి హానికరమని ప్రభుత్వం భావిస్తే.. దాని తయారీ, అమ్మకాలను ఎందుకు నిషేధించడం లేదని వారు నిలదీశారు.కాగా.. పాన్‌మసాలా వంటి ఉత్పత్తులకు సినీ ప్రముఖులు ప్రచారం చేయడంపై ఇప్పటికే వివాదం చెలరేగింది. గత ఆగస్టులో మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ తుకారాం ముండే.. ఆ ప్రకటనతో సంబంధమున్న బాలీవుడ్ నటులు షారుఖ్ ఖాన్, అజయ్ దేవ్‌గణ్, టైగర్ ష్రాఫ్‌లకు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది.

చురక

అనుకరణ పేర కాపీ
అలవడితే చౌర్యం
పులిని చూసి నక్క వాత
ప్రదర్శించే శౌర్యం.
పర సృజన తనది చేస్తే
పెరుగలేని బోన్సాయి
ప్రజలకుంది చౌర్యమని
ప్రకటించే గొప్ప సోయి

–వేల్పుల నారాయణ
9440433475

రాధశ్రీ రాగాలు

పాంచాల మాతనిది
బంగాళ మీతనిది
భరత దేశము మనది
అనును రాధశ్రీ !!
ఉత్తర మ్మొక్కరిది
దక్షిణ మ్మొక్కరిది
దేశము మరెవ్వరిది
అనును రాధశ్రీ !!

–రాధశ్రీ
సెల్:9494481210



గోదావరి, దేవాదుల ప్రాజెక్టు నీళ్లను సంపూర్ణంగా వినియోగించుకుంటాం: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, సెప్టెంబర్ 23:గోదావరి, దేవాదుల ప్రాజెక్టు నీళ్లను సంపూర్ణంగా వినియో గించుకోవడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తుంగతుర్తి నియోజకవర్గానికి దేవాదుల ప్రాజెక్టు నీళ్లు తెప్పిస్తానని మాటిచ్చారు. ఈరోజు (బుధవారం) సూర్యాపేట జిల్లాలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.365 టీఎంసీల నీటిని చుక్క నీరు కూడా వృథా కాకుండా ఉపయోగించుకునేలా కృషి చేస్తానని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. మొత్తం దేవాదుల ప్రాజెక్టు నీళ్లు 768 టీఎంసీలు ఉన్నాయని.. అందులో 465 టీఎంసీలు ఆంధ్రప్రదేశ్‌కు.. మరో 365 టీఎంసీలు తెలంగాణ వినియోగిచుకుంటాయని వెల్లడించారు. ఏ విధమైన రాజకీయ దురుద్దేశం లేకుండా కేసీఆర్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులను రిపేర్ చేయించడానికి తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు.

ఉద్యోగ సంఘాలతో చర్చలు సఫలం..

హైదరాబాద్, సెప్టెంబర్ 23: తెలంగాణ ప్రభుత్వంతో ఉద్యోగ సంఘాలు జరిపిన చర్చలు ముగిశా యి. రెండు డీఏలు ఇచ్చేందుకు సర్కార్ అంగీకరించింది. అలాగే నాలుగు నెలల తర్వాత మరో డీఏ ఇచ్చేందుకు ఓకే చెప్పింది. అంతేకాకుండా, ఈ నెలలోనే పీఆర్సీపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చింది. పీఆర్సీ కమిషన్ గడువును పొడిగించకుండా నివేదిక అందేలా చూడాలని ప్రభుత్వానికి ఉద్యోగ సంఘాలు విజ్ఞప్తి చేశాయి. గడువులోపే పీఆర్సీ ప్రకటించాలని కోరాయి. డీఏ, పీఆర్సీ విషయంలో ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీఎస్ సంజయ్ జాజు, ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా.. విమానాశ్రయాల నిర్మాణాలు

ఢిల్లీ తెలంగాణ భవన్ డిజైన్లపై సీఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్, సెప్టెంబర్ 23:తెలంగాణ చరిత్ర, సంస్కృతి, శిల్పకళ, వాస్తు సంప్రదాయాలు ప్రతిబింబించేలా రాష్ట్రంలో నిర్మించనున్న కొత్త విమానాశ్రయాలు, ఢిల్లీలోని తెలంగాణ భవన్ రూపుదిద్దుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు, ఢిల్లీలోని తెలంగాణ భవన్ నిర్మాణాలపై సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో సీఎం పలు సూచనలు చేశారు.

కాకతీయుల కళా వైభవానికి ప్రతీకగా నిలిచిన కాకతీయ కళాతోరణం, రామప్ప ఆలయం, పిల్లలమర్రి ఆలయాల శిల్ప, వాస్తు కళను అధ్యయనం చేసి, వాటి ప్రత్యేకతలు కొత్త నిర్మాణాల్లో ప్రతిబింబించేలా డిజైన్లను రూపొందించాలని సీఎం సూచించారు. తెలంగాణ సంప్రదాయ శిల్పకళ, నిర్మాణ శైలికి ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు.

విమానాశ్రయాల చుట్టూ రహదారులపై ప్రత్యేక దృష్టి

ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాల కాంపౌండ్ వాల్ సమీపం నుంచి రహదారులను అభివృద్ధి చేసి, వాటిని సమీపంలోని జిల్లా, రాష్ట్ర, జాతీయ రహదారులతో అనుసంధానించాలని సీఎం ఆదేశించారు. విమానాశ్రయాలకు వచ్చే, వెళ్లే రహదారులు విశాలంగా ఉండాలని సూచించారు.

శాఖల మధ్య సమన్వయం తప్పనిసరి

విద్యుత్, ఆర్‌అండ్‌బీ, తాగునీటి సరఫరా, నీటిపారుదల, బీఎన్ఎన్ఎల్ తదితర విభాగాలు విడివిడిగా పనులు చేపడితే భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని సీఎం పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అవసరమైన పనులను ఏకకాలంలో చేపట్టాలని సూచించారు.

భవిష్యత్ అవసరాలకూ తగ్గట్టుగా ప్రణాళిక

ప్రస్తుతం ఉన్న అవసరాలను మాత్రమే పరిగణనలోకి తీసుకోకుండా.. భవిష్యత్‌లో పెరిగే అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకుని సమగ్ర ప్రణాళిక రూపొందించాలని రేవంత్‌రెడ్డి సూచించారు. విమానాశ్రయాల అభివృద్ధితో పాటు అనుబంధ మౌలిక వసతులకూ తగిన ప్రణాళిక ఉండాలని స్పష్టం చేశారు.

వాగుల మళ్లింపునకు చెరువులు

విమానాశ్రయాల నిర్మాణ ప్రాంతాల్లో వాగులు, ఇతర నీటి ప్రవాహాలను మళ్లించాల్సిన పరిస్థితి ఉంటే.. విమానాశ్రయ ప్రాంగణంలో లేదా సమీపంలో చెరువులు నిర్మించి, నీటి ప్రవాహాలను సురక్షితంగా మళ్లించేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.

విమానాశ్రయాల అభివృద్ధికి సమగ్ర మౌలిక వసతులు

విమానాశ్రయాల నిర్మాణంతో పాటు రహదారులు, విద్యుత్ లైన్లు, తాగునీటి పైపులైన్లు, బీఎన్ఎన్ఎల్ లైన్లు, నీటి ప్రవాహాల మళ్లింపు వంటి అనుబంధ పనులను కూడా సమన్వయంతో పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. నిర్ణయించిన గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సమీక్ష సమావేశంలో ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీలు వేమ్ నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, ఆర్‌అండ్‌బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ వైభవానికి కొత్త రూపం

వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలు, ఢిల్లీ తెలంగాణ భవన్ కేవలం మౌలిక వసతుల ప్రాజెక్టులుగా కాకుండా తెలంగాణ చరిత్ర, సంస్కృతి, కళా వైభవాన్ని ప్రతిబింబించే నిర్మాణాలుగా తీర్చిదిద్దాలన్నది సమీక్షలో సీఎం ప్రధానంగా సూచించారు. ముఖ్యంగా వరంగల్ విమానాశ్రయ డిజైన్‌లో కాకతీయ వారసత్వాన్ని ప్రతిబింబించే అంశాలను పొందుపరచాలన్న దిశగా ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రంతో చర్చలు జరిపినట్లు అధికారిక సమాచారం కూడా వెల్లడిస్తోంది.

బాలికపై లైంగిక వేధింపులు.. ఎన్‌కౌంటర్‌లో నిందితుడికి బుల్లెట్ గాయాలు..

పాట్నా, సెప్టెంబర్ 23: బిహార్‌లో పదో తరగతి విద్యార్థినిపై లైంగిక వేధింపుల కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న నందన్ యాదవ్‌పై పోలీసులు కాల్పులు జరిపారు. పరారీలో ఉన్న అతడిని పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. అయితే, వారి నుంచి తప్పించుకునేందుకు యత్నించడంతో నందన్ యాదవ్‌పై కాల్పులు జరపాల్సి వచ్చింది. ఈ కాల్పుల్లో అతడి కాలికి బుల్లెట్ గాయాలయ్యాయి. అనంతరం నందన్ యాదవ్‌తో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు, మిగతా నిందితుల కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.

కాగా, రెండు రోజుల కిందట జమయి జిల్లా మద్వా పహాడ్ ప్రాంతంలో ఇద్దరు పదో తరగతి విద్యార్థులపై అల్లరి మూక దాడి చేసింది. కోచింగ్ క్లాసుల నుంచి ఇంటికి వెళ్తున్న బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడగా.. బాలుడిని తీవ్రంగా హింసించారు. బాలికను అసభ్యకరంగా తాకుతూ చిత్రహింసలకు గురిచేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారడంతో దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. ఈ లైంగిక వేధింపుల ఘటనను సీరియస్‌గా తీసుకున్న బిహార్ ప్రభుత్వం నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు సిట్‌ను కూడా ఏర్పాటు చేసింది. దీంతో నిందితులపై పోక్సో కేసు నమోదు కాగా.. ముగ్గురిని అరెస్టు చేశారు. మిగిలిన వారి కోసం గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నిందితుడు నందన్ యాదవ్‌ను పట్టుకునేందుకు పోలీసులు కాల్పులు జరిపారు.

తెలంగాణలోని జూరాల ప్రాజెక్టుకు నీటి విడుదలకు కర్ణాటక గ్రీన్ సిగ్నల్..

హైదరాబాద్, సెప్టెంబర్ 23: తెలంగాణలోని జూరాల ప్రాజెక్టుకు నీటి విడుదలకు కర్ణాటక సర్కార్ అంగీకారం తెలిపింది. అల్మట్టి నుంచి మూడు టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక సీఎం డీకే శివకుమార్ సానుకూలంగా స్పందించారు. అంతర్‌రాష్ట్ర జలాల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ బృందం.. కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో సమావేశం అయ్యారు. ఈ భేటీలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు జి. మధుసూదన్ రెడ్డి, మేఘరెడ్డి ఉన్నారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ఆల్మట్టి నుంచి జూరాలకు నీటిని విడుదల చేయాలని ఇప్పటికే మంత్రులు వినతిపత్రం సమర్పించిన విషయం తెలిసిందే.

ఉమ్మడి పాలమూరు జిల్లాలో నీటి ఎద్దడి, పంటల ప్రస్తుత పరిస్థితులు వంటి అంశాలను డీకే శివకుమార్‌కు మంత్రులు వివరించారు. మానవతా దృక్పథంతో పాలమూరు ప్రజలకు సాగు, తాగునీటిని విడుదల చేయాలని మంత్రులు, ఎమ్మెల్యేలు కోరారు. మంత్రుల విజ్ఞప్తికి కర్ణాటక సీఎం అంగీకరించారు. నీటి విడుదలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆ రాష్ట్ర అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. నీటి విడుదలలో ఆలస్యం చేయకుండా వెంటనే చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు.

కాగా, సీఎం రేవంత్‌రెడ్డి నిన్న తనకు ఫోన్ చేశారని తెలంగాణ ప్రజాప్రతినిధులకు డీకే శివకుమార్ వెల్లడించారు. తాను అసెంబ్లీలో ఉండటంతో రేవంత్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడలేకపోయానని డీకే వివరించారు. తిరిగి కాల్ చేసి చాలాసేపు మాట్లాడుకున్నామని చెప్పుకొచ్చారు. రెండు రాష్ట్రాలు సమన్వయంతో పనిచేస్తే రైతుల అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు వెళ్లవచ్చని పేర్కొన్నారు. వీలైనంత త్వరగా తెలంగాణకు నీటిని విడుదల చేస్తామని కర్ణాటక ఇరిగేషన్ అధికారులు చెప్పారు. కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంపై తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేలు హర్షం వ్యక్తం చేశారు.

రైతుల పంట నిల్వకు భరోసా

తాడ్వాయిలో రూ.7 కోట్లతో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్య గోదాము
ఆరు నెలల్లో నిర్మాణం పూర్తి చేయాలి: మంత్రి సీతక్క

ములుగు, సెప్టెంబర్ 23:(నేటినిజం ప్రతినిధి): రైతులు పండించిన ధాన్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను సురక్షితంగా నిల్వ చేసేందుకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తూ ప్రజా ప్రభుత్వం రైతన్నకు అండగా నిలుస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం తాడ్వాయి మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో రూ.7 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్య గోదాముకు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాడ్వాయి మండల రైతులకు ఉపయోగపడేలా భారీ సామర్థ్యంతో గోదాము నిర్మించడం సంతోషకరమన్నారు. పంటలను నిల్వ చేసేందుకు సరైన వసతులు లేక రైతులు ధాన్యాన్ని రహదారులపై ఆరబెట్టాల్సి వస్తోందని, అకాల వర్షాలకు ధాన్యం తడిసి మొలకెత్తే పరిస్థితులు ఎదురవుతున్నాయని తెలిపారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా నిల్వ సదుపాయాలను విస్తరిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. తాడ్వాయి మండలంలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల ఆధ్వర్యంలో మరో గోదాము నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో వ్యవసాయ విస్తీర్ణంతోపాటు పంట దిగుబడులు పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని గోదాముల నిల్వ సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం నిర్మించనున్న గోదాము తాడ్వాయి మండల రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. అక్టోబర్ నుంచి నిర్మాణ పనులకు అనుకూల సమయం ప్రారంభమవు తున్నందున పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వచ్చే వర్షాకాలానికి ముందే గోదాము నిర్మాణాన్ని పూర్తి చేయాలని, గిడ్డంగుల సంస్థ అధికారులు, గుత్తేదారులు సమన్వయంతో పనిచేసి ఆరు నెలల్లో రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

గిరిజన ఆవాసాలు, ఎస్సీ కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. ఇటీవల గిరిజన ఆవాసాల్లో సిమెంట్ కాంక్రీటు రహదారుల నిర్మాణానికి సుమారు రూ.50 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. గతంలో ఎస్సీ కాలనీలకు నిధులు కేటాయించామని, ప్రస్తుతం ఎస్టీ కాలనీల్లోనూ పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. విద్యుత్ సౌకర్యం లేని మారుమూల గూడాల్లో ఇంటింటికీ వెలుగులు అందించడంతోపాటు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు సౌర విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను వచ్చే పది రోజుల్లో ప్రారంభించి పనులను వేగవంతం చేస్తామని చెప్పారు. పర్యావరణానికి, అటవీ జంతువులకు ఇబ్బంది కలగకుండా గిరిజన ఆవాసాల్లో తాగునీరు, రాత్రిపూట వెలుతురు వంటి కనీస సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

మహిళా సంఘాలు ముందుకొస్తే ఐదు నుంచి పది ఎకరాల విస్తీర్ణంలో సౌర విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు సహకారం అందిస్తామని సీతక్క తెలిపారు. సౌర విద్యుత్ ఉత్పత్తి ద్వారా మహిళా సంఘాలకు నెలకు రూ.5 లక్షల వరకు ఆదాయం లభించేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే కార్యక్రమాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.

నేటినిజం
సాహితీ కైరటాలు
website:www.netinijam.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 గురువారం 24-9-2026

ప్రకృతిలో ఆడజీవికి దొరికిన తోడు మానవ సమాజంలో శాశ్వతంగా "రిటైర్డ్" అయింది!

రిటైర్డ్ అయ్యాను..

నాంపల్లి సుజాత గారు రాసిన "రిటైర్డ్ అయ్యాను..!" కవిత చదివినప్పుడు మనసులో ఒక రకమైన ఆవేదన, సమాజంపై కోపం రావడం ఖాయం. మనం పెద్ద పెద్ద చదువులు చదివామని, చాలా గొప్పగా బతుకుతున్నామని బిల్డప్ ఇచ్చుకుంటాం కానీ, మన మనుషుల సమాజాన్ని చూస్తే నిజంగానే ఒళ్లు మండుతుంది. ఏ ఆడదైనా పుట్టడమే కష్టాలు పడటానికి పుట్టిందా? అన్నట్టు ఈ సమాజం చాలా ఈజీగా ఫిక్స్ అయిపోతుంది. అసలు ఇది దేవుడు సృష్టించిన వ్యవస్థ కాదు కదా! మగవాళ్లు తమ స్వార్థం కోసం, వాళ్ల సుఖం కోసం కావాలని రాసుకున్న కుళ్లిన రూల్స్ ఇవి. కానీ ఒక్కసారి జంతువులను, పక్షులను చూస్తే అసలు నిజం ఏంటో తెలిసి మన మనుషులకు సిగ్గు వేయాలి. అక్కడ ఏ ఆడజీవి కూడా ఒంటరిగా కష్టపడదు. ఆడ దాని భారాల్ని పంచుకోవడానికి, అవసరమైతే అంతకంటే ఎక్కువ శ్రమించడానికి ప్రకృతిలో ఎన్నో అద్భుతమైన మగజాతులు ఉన్నాయి.

సముద్రంలో ఉండే 'నీటి గుర్రం' జీవితాన్ని చూస్తేనే మనకు అర్థమవుతుంది; ప్రపంచంలోనే ఆడదానికి బదులు మగదే కడుపు పండే ఏకైక జీవి ఇది. ఆడ నీటి గుర్రం గుడ్లు పెడితే, మగ నీటి గుర్రమే వాటన్నింటినీ తన పొట్ట సంచిలో వేసుకుని, వోసి, పొదిగి, నొప్పులు పడి మరి పిల్లలను బయటకు తెస్తుంది. అలాగే 'నీటి పురుగుల'లో, ఆడ పురుగు గుడ్లు పెట్టగానే మగ పురుగు వాటన్నింటినీ (దాదాపు 150 గుడ్లను) తన వీపుపైనే అంటించుకుని, అవి పిల్లలుగా మారే వరకు మోస్తూ తిరుగుతుంది. 'జకానా పక్షి'లో అయితే ఆడది గుడ్లు పెట్టగానే వేరే మొగుడి కోసం వెళ్ళిపోతుంది, మగ పక్షే ఒంటరిగా గూడు కట్టి, గుడ్లను పొదిగి పిల్లలను పెంచు తుంది. ఇక 'పెంగ్విన్' తండ్రి గడ్డకట్టే చలిలో రెండు నెలలు అన్నం నీళ్లు లేకుండా ఒంటి కాలిపై నిలబడి గుడ్డును కాపాడుతుంటే, ఆడ పెంగ్విన్ హాయిగా సముద్రంలో తిండి కోసం వెళుతుంది. 'జెంటూ పెంగ్విన్లు' గూడు కట్టడానికి కావలసిన రాళ్లను ఏరి తేవడంలో మగవే రాత్రి పగలు కష్టపడతాయి. 'ఫ్లెమింగో' పక్షు లలో మగ, ఆడ కలిసి బురదతో గూడు కడతాయి, ఇద్దరూ డ్యూ టీల వారీగా గుడ్లపై కూర్చుం టారు; అంతేకాదు మగ ఫ్లెమింగో కూడా తన గొంతు నుండి పాలు తయారు చేసి పిల్లలకు తాగిస్తుంది. 'తోడేళ్ళ'లో ఆడది పిల్లలను కని గుహలో ఉన్నప్పుడు మగ తోడేలు వేటాడి తిండి తెచ్చి ఇస్తుంది, పిల్లలు పెద్దవయ్యాక వాటికి వేట నేర్పించే పూర్తి బాధ్యతను తండ్రే తీసుకుం టుంది.

'బీవర్లు' కలిసి ఇళ్ళు కడితే, చలికాలం కోసం తిండి దాచడంలో మగ బీవర్ రాత్రి పగలు శ్రమిస్తుంది. 'కొమ్ముల పక్షి'లో ఆడది గుడ్లు పెట్టి చెట్టు తొర్రలో ఉన్నప్పుడు, మగ పక్షి ఆ తొర్ర ద్వారాన్ని మట్టితో మూసివేసి, రెండు నెలల పాటు అడవి అంతా తిరిగి ఒక చిన్న రంధ్రం ద్వారా పెళ్లాం పిల్లలకు తిండి అందిస్తుంది.

ఇలా జంతువులు, పక్షులలో మగవి ఆడవాటికి తోడుగా ఉంటూ, పనులన్నీ పంచుకుంటుంటే... మన మనుషుల దగ్గరికి వచ్చేసరికి కథ మొత్తం ఉల్టా అయిపోయింది. ఇక్కడ ఆడదాన్ని కేవలం ఇంట్లో ఫ్రీగా పనిచేసే ఒక మిషన్ లా మార్చేశారు. సుజాత గారి కవితలో చెప్పినట్టు ఒక మగాడు ఉద్యోగం నుంచి రిటైర్ అయితే హాయిగా వాలుకుర్చీలో కూర్చుని విశ్రాంతి తీసుకుంటాడు, పేపర్ తిరగేస్తాడు, వేడి వేడి చాయ్ తాగుతూ దోస్తులతో ముచ్చట్లు పెడతాడు. మరి అదే ఉద్యోగం చేసి, సమాజానికి ఎంతో సేవ చేసి రిటైర్ అయిన స్త్రీకి దొరికే ఆ విశ్రాంతి ఏది? మళ్లీ అదే వంటగది, అరిగిన చేతులతో గిన్నెలు తోమడం, ఊపి రి సలపని ఇంటి చాకిరీ! వంట చేయడం, ఇల్లు ఊడవడం కేవ లం ఆడవారి పనులే అని ప్రకృతి ఎక్కడా రూల్ పెట్టలేదు, ఈ సమాజమే ఆ కట్టుబాట్లను తయారు చేసింది. రోజుకు 24 గంటలు విరామం లేకుండా స్త్రీలు చేసే ఈ గానుగెద్దు చాకిరీని "అది ఆమె బాధ్యత" అని చాలా సింపుల్ గా సరిపెడుతున్నాం. ఇంటిని మోసిన స్త్రీ చేతులకు విశ్రాంతి దొరకనంత కాలం, ఈ కుటుం బాల్లోని ఆలోచనలు మారనంత కాలం ఆడవాళ్లకు నిజమైన స్వేచ్ఛ లేదు. ప్రకృతిలోని మగజీవుల లాగా మన ఇళ్లలోని పురుషులు కూడా శ్రమను సమానంగా పంచుకున్న రోజే, స్త్రీ శ్రమకు కనీస గౌరవం దక్కిన రోజే ఆ కుటుంబంలో నిజమైన సంస్కృతి మొదలవుతుంది.

అప్పుడే మన సమాజానికి కూడా నిజమైన నాగరికత వస్తుంది.

ఇక అంతా విశ్రాంతే అభినందనలు
అన్నారు మిత్రులు
నలభై ఏళ్ల ఉద్యోగ
జీవితానికి గౌరవంగా
వీడ్కోలు పలికారు
పూలదండలు..శాలువాలు.
.ప్రశంసల వర్షం
ముగిసి ఇంటికి వచ్చాను.
ఎప్పటి చిప్ప యెనుగులనే..!
చింపిరి జుట్టుతో
చిందర వందరైన ఇల్లు నా కోసం
అసహనంగా ఎదిరి చూస్తుంది.
పొయ్యిల పిల్లి బద్ధకంగా
కళ్ళు మూసుకొని ముడుచుకుంది..
నా రిటైర్మెంట్..
ఉద్యోగం నుంచి మాత్రమేననీ,
ఇంటిచాకిరీ వంటా
నా నెత్తినేనని ఎరుక
చెరిగి పోలేదు...!.
నేనిక 127 ఇంటిపట్టునే..
విలువా వెలా లేని గానుగెద్దు నౌకరీ..
చెమట కాలువలతో నీరసించి
రోజులు వెళ్ళదీస్తున్న
మధుమేహం రక్తపోటు
పిలవకుండానే
దేహంలోకి వచ్చిన అతిథులు..
మానసిక శారీరక..
అలసటలు మహిళలకెందుకు
ఉండవనుకుంటరో
మహానుభావులు..!?
వాలు కుర్చీలో కాలు మీద కాలేసుకుని,
తిప్పిన పేపరే తిప్పేస్తూ..
చాయ్ చప్పరిస్తూ
పాత మిత్రులతో నిరంతర బాతఖానీ
స్త్రీల కెందుకు లేదో ఆ యోగం..!
ఒకప్పుడు..వందల మంది పిల్లల భవిష్యత్తును
అక్షరాలతో తీర్చిదిద్దిన చేతులు.
ఇప్పుడు గిన్నెలు తోముతూ..
ఇంటిని దిద్దుతూ
అరిగిన వేళ్ళతో పొగసూరినై..
అప్పుడు..
బస్సు ప్రయాణాల్లోనన్నా
నా లోకి నేను వెళ్ళేది,
నన్ను నేను నిలబెట్టుకునేది
నా కలం లోంచి
నాలుగు కవితాక్షరాలను
పూయించేది.!
ఇప్పుడు నీకేం పని !?
అంతా తీరికే అంటారు.. కానీ,
ఎక్కడి నుంచి పుట్టుకొస్తుందో
ఊపిరి సలపని చాకిరీ
జీత భత్యాల మాట అంటుంచితే..
గడియ తీరిక
గవ్వ గౌరవం లేని బతుకు !
రిటైర్మెంట్ అంటే..
జీతానికి మాత్రమే గానీ,
జీవితానికి కాదని తెలుసుకున్నాను..!
ఇంటిని మోసిన స్త్రీ చేతుల శ్రమకు
విశ్రాంతి దొరికే
కుటుంబ సంస్కృతి మారిన రోజే
ఉద్యోగ విరమణ పర్వదినం.

–నాంపల్లి సుజాత
9848059893

–సర్వేశ్వరరావు నీలం
6304664725

ఆత్మావలోకనం

ప్రభూ!
దీనకరుడిలా
ఉభయ సంధ్యల మధ్య
జీవన రథం సాగిపోతూ ఉన్నా
అవసరానికి మించి
భౌతిక సుఖాలను పొందుతూ ఉన్నా
ఎందుకో ఏమో గాని
అంతరంగంలో అనంత సంఘర్షణ
నిరంతరం కొనసాగుతూనే ఉంది
విశ్వజనీన దృక్పథంతో
సామాజిక చైతన్యంతో
మానవీయ తత్వంతో
ఉదాత్త భావనతో
నిరుపేదల నిస్సహాయుల
అణగారిన అభాగ్యుల
జీవన విషాదాల్ని స్పృశించక
వారి బతుకు ఆరాటాల్ని చిత్రించక
కళ్ళముందు కనబడుతున్న
అమానుష, అమానవీయ
హింసాత్మక ఘటనల్ని ఖండించక
నియంతృత్వ పోకడల్ని ప్రశ్నించక
జన సంక్షేమానికై స్వచ్ఛ పాలనకై
అంకిత భావనకు కట్టుబడి
సమకాలీన పరిణామాలపై
ఉద్యమిస్తున్న యువ హృదయాలకు
చేయూత అందించక
చలనం లేని కఠిన శిలలా
మౌన ప్రేక్షకుడిలా
అంతర్గత సంఘర్షణని భరిస్తూ
కంటికి కనిపించని నీతో
గాఢానుబంధాన్ని పెంచుకొని
స్వీయ పారమార్థిక ఆనందం కోసం
ఆ భావనలో లీనమై
అనుక్షణం గడుపుతూ ఉండడం
సరియైనదో కాదో తెలియక
మనసు క్షోభిస్తూనే ఉంది.
ప్రభూ!
నా వేదనా భరిత హృదయాన్ని
నా అంతరాత్మ స్వరాన్ని
యథా తథంగా
ఆవిష్కరిస్తున్నందుకు
నన్ను మన్నించు తండ్రీ!

– డా॥సమ్మన్న ఈటెల
సెల్: 9885238654

టి.వి.స్వామి రచనలు "మహాస్థపతి సిరిలూత", "అమెరికాలో నా అనుభవాలు" పుస్తకాల ఆవిష్కరణ

పుస్తకావిష్కరణలో రఘుశ్రీ, బైస దేవదాసు, ఆచార్య టీ. గౌరీశంకర్, టి.వి.స్వామి, ఆచార్య కొలకలూరి ఇనాక్, డా॥ అనంత పద్మనాభరావు, కిన్నెర రఘురాం.

హైదరాబాద్, సెప్టెం బర్ 23: 'మహాస్థపతి సిరిలూత' చారిత్రక నాట కం రాసిన రచయిత తిరుమల వెంకటస్వామి ధన్యులని, ఆయన చక్కని అంశాన్ని తీసుకొని నాటి కాలపు చరిత్రను దృశ్యంగా అందించారని శ్రీ వెంకటే శ్వర విశ్వ విద్యాలయం పూర్వ ఉపకులపతి పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. శ్రీ మానస ఆర్ట్స్ థియేటర్స్, భాషా నిలయం సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత తిరు మల వెంకట స్వామి రచిం చిన **"మహా స్థపతి సిరి లూత" చారిత్రక నాటకం, "అమెరికాలో నా అనుభవాలు"** పుస్తకాల ఆవిష్కరణ సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆచార్య కొలకలూరి ఇనాక్ మహాస్థపతి సిరిలూత చారిత్రక నాటక పుస్తకం ఆవిష్కరించారు.

"అమెరికాలో నా అనుభవాలు" పుస్తకంను నేటినిజం సంపాదకులు బైస దేవదాసుకు, "మహాస్థపతి సిరిలూత' పుస్తకంను ప్రముఖ సాహితీవేత్త, దూరదర్శన్ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా॥అనంత పద్మనాభరావుకి అంకితం ఇస్తున్న రచయిత తిరుమల వెంకట స్వామి.

కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ కార్యదర్శి మద్దాళి రఘురాం "అమెరికాలో నా అనుభవాలు" పుస్తకం ఆవిష్కరించారు. ఆచార్య ఇనాక్ మాట్లాడుతూ చారిత్రక నాటకాలు జాతి కరదీపికలని, అందునా స్ఫూర్తి నిచ్చే రచనలు వెలుగు చూడాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని మంచి చారిత్రక నాటకాన్ని సరళ సుందర దృశ్య కావ్యంగా అందించిన టి.వి.స్వామి అభినంద నీయుడన్నారు. మద్దాళి రఘురామ్ మాట్లాడుతూ.. అమెరికా వెళ్ళాక వారు తమ తమ అనుభవాలు నెమరు వేసుకుంటారని, వెళ్ళని వారికి ఎన్నో విషయాలు ఈ అమెరికా అనుభవాలు పుస్తకం ద్వారా తెలుస్తాయని రచయిత టి.వి.స్వామిని అభినందించారు. "నమో నమో ప్రియ భారత మాత" ఆడియోను సభలో పాల్గొన్న అతిథులు ఆవిష్కరించారు. ప్రముఖ సాహితీవేత్త, దూరదర్శన్ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా॥అనంత పద్మనాభరావుకి రచయిత తిరుమల వెంకట స్వామి "మహాస్థపతి సిరిలూత" చారిత్రక నాటకం పుస్తకాన్ని, సాహితీవేత్త బైస దేవదాసుకి "అమెరికాలో నా అనుభవాలు" పుస్తకాన్ని అంకితం ఇచ్చి ఘనంగా సత్కరించారు.

సభకు ప్రముఖ సాహితీవేత్త, తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టీ. గౌరీశంకర్ అధ్యక్షత వహించారు. కవి ఉమ్మడి సింగు రాఘవ రావు పుస్తకాలను సమీక్షించారు.

సభకు ముందు మిద్దె సురేష్ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరిగింది.

నరుడు - సింహాల కాలమ్!

"నువ్వు చాలా తెలివిగలవాడివి మేంగో. అఫ్ కోర్స్. నీ బృందంలో అన్య, విదూలు వున్నారు. వారు కూడా స్మార్ట్" అన్నాడు ఓ పెద్దాయన.

"ఇప్పుడు మా తెలివితేటల సమస్య ఎందుకు వచ్చింది?" అన్నాను.

"మీ కాలమ్ చదువుతున్నాను. నువ్వు సందర్భాన్ని బట్టి మిస్టర్ క్లీన్‌ని తీసుకువస్తున్నావు. అలాగే మీ తాతగారు వస్తుంటారు. నువ్వు ఎవరిని ఏం అనాలనుకున్నా వారితో అనిపిస్తావు. నీ చేతులకు మట్టి అంటుకోకూడదు. అప్పుడప్పుడు ఏదో ఒక చిలిపి కామెంట్ లు మీరు చేస్తుంటారనుకో" అన్నాడు.

"మట్టి అంటుకోవటానికి, క్లీన్ చేసుకోవడానికి మేము రాజకీయ నాయకులమా? అయినా మా మిస్టర్ క్లీన్ గారికి ఇవన్నీ తెలియవా? ఆయనగాని, మా తాతగారు గాని కావాలంటే ఎన్ని కాలమ్స్ అయినా రాసుకుంటారు. మా దగ్గర మాట్లాడటం అవసరమా?" అన్నాను.

"మీరు ఇప్పుడు పొలిటీషియన్స్ కాదేమో! రేపటి రాజకీయ నాయకులే కదా? అందులోనూ ఇప్పుడు జెన్-జీ రోజులు నడుస్తున్నాయి. మీకూ కొంతమంది పాఠకులు వున్నారు. అందుకని మీ గెస్ట్‌లు మీ దగ్గరకు వస్తున్నారు. ఇంకా నీకు కొన్ని విషయాలు క్లారిఫై చెయ్యాలి. మీరు తెలివిగలవారు అనటానికి ముందు కారణాలు చెబుతాను."

"చెప్పండి" అన్నాను.

"మీరు వయసులో చిన్నవారు. మీకు ఏ అనుభవం వుందని ఇవన్నీ మాట్లాడుతున్నారు. తీర్పులు ఇస్తున్నారు. వాచాలత్వం అంటే ఇదే కదా అని మాలాంటివారు గర్జిస్తారు. అందుకని ముందుగా నమస్కారం బాణం వదులుతున్నారు.

ఈ కాలమ్ లో వెలిబుచ్చే అభిప్రాయాలు చెప్పినవారి సొంతం. ఇందులో మీకూ, మాకు ఎలాంటి బాధ్యత లేదు. మాది ప్రజాస్వామ్యం. ఎవరైనా ఏదైనా అనవచ్చు. మీ అభిప్రాయాలను కూడా మేము పాఠకుల ముందు వుంచుతాం అంటారు. అవునా?"

"ఇందులో తప్పేముంది, ఎవరైనా అదే చేస్తున్నారు!"

"లోకంలో అనేక సమస్యలు వున్నాయి. మీ పిల్లల కోరికల గురించి చెప్పాలంటే రకరకాల బొమ్మలు వున్నాయి. వందల రకాల వంటకాలు వున్నాయి. అందమైన ప్రాంతాలు వున్నాయి.

మీరు వాటి గురించి అడగవచ్చు. రాయించవచ్చు. మాట్లాడించవచ్చు. అలాగే మీ పిల్లలకి రకరకాల రోగాలు వస్తుంటాయి. మీ కాలమ్ లోకి డాక్టర్లను తీసుకురావచ్చు. అవన్నీ వదిలేసి మీకు రాజకీయాలు ఎందుకు? తాత్విక సమస్యలు ఎందుకు? అలాంటివన్నీ చర్చిస్తే మీ కాలమ్ ముఖం చూసేవారు వుండరని మీకు తెలుసు. ఎందుకంటే ఎన్ని వివాదాలు వుంటే అంతమంది చూస్తారని ఈ పిల్ల వయసులోనే మీకు అర్థం అయింది. అందుకు స్మార్ట్ అంటున్నాను."

"స్మార్ట్ ఫోన్ చేతుల్లో వున్నప్పుడు స్మార్ట్ గానే వుండాలి అంకుల్. అయినా మీరు గమనించి వుంటారు - మా మెంటార్ మేము అడిగినవాటికి మాత్రమే సమాధానం చెప్పరు. ఆయనే ప్రశ్నలు అడుగుతారు, ఆన్సర్ చెబుతారు."

"వాటిని మీరు ఎందుకు బహిష్కరించరు?"

"మేం ఎవరం బహిష్కరించడానికి. ఇప్పుడు మీరు మాట్లాడుతుంటే మేము కాదన్నామా?" అన్నాను.

"మీరే కాదు ఎవరైనా ఓ చర్చ పెట్టారంటే అర్థం ఏమిటి? దానిమీద చర్చ పేరుతో ఎదుటివారిని ఎండగట్టాలి. అసలు అందులో మాట్లాడటానికి ఎవరిని పిలుస్తున్నారు? వారిని చూస్తేనే ఆ సంభాషణ ఎంత సుందర ముదనష్టంగా వుంటుందో అర్థం అవుతుంది. అక్కడికి వచ్చినవారు నువ్వు అడిగినవే చెప్పరు. ఫ్లాష్ బ్యాక్ లు చెబుతారు.

ఫ్లాష్ ఫార్వర్డ్ కి వెళ్తారు. నువ్వు తలచుకుంటే నియంత్రించగలవు. తలుచుకున్నా అక్కడికి వచ్చినవారు ఆగరు. రెచ్చిపోతారు. అసలు మాట్లాడేవారిలో ఒక్కరి ముఖంలో నవ్వు వుంటుందా? చివరికి ఏమవుతుందో తెలుసా?"

"అదీ తమరే వివరించండి" అన్నాను.

"ఎవరో ఒకరు చెప్పులు తీస్తారు. ఫటాఫట్ మంటూ కుమ్మేస్తారు. అవతలివాడున్నూ ఎదురు తిరుగుతాడు. అక్కడ బహు సుందరమైన బూతు పురాణం మొదలు.

తర్వాత పది రోజులు అదే విషయం. బూతుల్ని మ్యూట్ చేస్తారు. మళ్లీ చెప్పు దెబ్బలు దృశ్యం రిపీట్ అయ్యేంతవరకు చర్చలు మర్యాదపూర్వకంగా సాగుతాయి. ఇదేగా మన చర్చల మెలోడ్రామా!"

కాసేపు నిశ్శబ్దం.

"మీరు అలాంటి రిస్కులు తీసుకోవడం లేదు. అందుకని తెలివిగలవారు అంటున్నాను. ఇది మీకు కాంప్లిమెంట్ మేంగో!"

"తిట్టాల్సినవన్నీ తిట్టి కాంప్లిమెంట్ అంటారా?"

"అయ్యో? ఈ దేశం ఎలా తగలడింది అంటే ఏది తిట్టో, ఏది పొగడ్తో అర్థం చేసుకోలేకపోతున్నారు.

వాటి మధ్య గీతలు చెరిపేసారు. మనందరికీ తెలుసు రాజకీయ నాయకులు, మేధావులు ఏదీ స్పష్టంగా చెప్పరు. మాటల మధ్య దాక్కుంటారు. వారు ఇతరుల్ని ప్రేరేపిస్తారు. వాళ్లది షార్ట్ టెంపర్ ఆ పూటకి మద్యం, బిర్యానీ కావాలి. అందుకోసం రెచ్చిపోతారు.

తర్వాత లాఠీ దెబ్బలు తింటారు. జైల్లోకి పోతారు. అదంతా రోజూ జరిగే రామాయణమే. ఇవన్నీ మీరు ఎప్పుడు నేర్చుకున్నారు?" అన్నాడాయన.

"బై బర్త్ వచ్చాయి మీ థియరీ ప్రకారం" అన్నాను.

"నువ్వు తెలివిగలవాడివి అన్నాను. నా మాట వెనక్కి తీసుకుంటున్నాను."

"అన్‌పార్లమెంటరీ కామెంట్లని వెనక్కి తీసుకుంటామంటారు. కాంప్లిమెంట్లను కూడానా?" అన్నాను.

"మీరు మహా ముదురులు. ఇది ప్రశంశో, విమర్శో మీరే తేల్చుకోండి. అయితే మీరు నాకు ఛాలెంజ్ విసిరారు, ఇప్పుడు నేను కూడా ఓ కాలమ్ ని మొదలు పెడుతున్నాను."

"వెల్కమ్. వెయ్యి కాలమ్స్ ని వికసింపచేద్దాం. ఇంతకీ మీ కాలమ్ పేరేంటి?"

"నర-సింహ కాలమ్."

"అంటే నరుడు గానూ సింహం గానూ ద్విపాత్రాభినయం చేస్తారా? ఇది కూడా క్లారిఫై చేయండి. ఇది మా జెన్జీలకు వ్యతిరేకంగానా, ఇంకెవరి మీదనైనానా?"

"వెయిట్ అండ్ సీ" అని నిష్క్రమించాడాయన.

అదీ సంగతి, అన్ని కాలమ్స్ ఒకటి కావు!

– పి.చంద్రశేఖర అజాద్
92465 73575

"సాహితీ స్వర్ణోత్సవ కవితా రాయంచ"

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 12వ స్నాతకోత్సవంలో వైస్ చాన్సలర్ గా ప్రసంగిస్తూ..













అపారమైన భాషాభిమానాన్ని కలిగి, సాహిత్యాన్ని ప్రాణంగా ప్రేమించే సాహితీ పిపాసులలో ప్రథమ వరుసలో గణుతింపదగినవారు ఆచార్య అనుమాండ్ల భూమయ్య గారు. కవిత్వ, విమర్శలను కనుగవగా లోతులను వీక్షించి, వినూత్న దృక్పథంతో వాటిని ఆవిష్కరించి, సాహితీ శిఖరాగ్రాన్ని చేరుకున్న గొప్పకవి, రచయిత. బోధనను వృత్తిగా స్వీకరించినప్పటికీ ప్రవృత్తిగా సాహితీ సుధాసాగరాన్ని మథించారు. ఎవరికీ అందని కావ్య మార్మికతా మణులను కనుగొన్నారు. ఆయనలోని గాఢమైన పరిశీలనా వివేచన, విశేష పరిశోధనా పటిమ విశిష్టతలను సంతరించుకుని సాహితీ చరిత్రలో ఆయనను సమున్నత స్థానంలో నిలిపాయి.

నిరంతర పఠనానురక్తి, నూతన దృగ్వివేకంతో భూమయ్య గారు సృష్టించిన అద్భుత సాహిత్యానికి ఐదు పదులు నిండిన సందర్భంగా, యాభైకి పైగా వెలువరించిన వైవిధ్యభరితమైన పుస్తకాలు ఆ సమగ్ర సాహితీ మూర్తిమత్వ స్వర్ణోత్సవానికి కొలమానం లేని ప్రత్యేకతను ఆపాదించాయి. సాహిత్యంతో పాటు తాత్త్వికత, ఆధ్యాత్మికతా పార్శ్వాలు ఆయనను కవి రాజహంసను చేశాయి. అందుకు తగినట్లుగా విశేషమైన విజ్ఞానంతో స్వచ్ఛమైన స్వేచ్ఛా విహంగమై నలుదెసలా విహరిస్తూ విలక్షణలక్షితులైనారు.

సాహిత్య సుగంధ పవనాలు ఏమాత్రం స్పృశించని కుటుంబంలో సెప్టెంబర్ 5, 1950వ సంవత్సరంలో కరీంనగర్ జిల్లా వెదురుగట్ట గ్రామంలో శాంతమ్మ, లసుమయ్య గార్లకు సత్సంతానంగా అనుమాండ్ల భూమయ్యగారు అవనిపై ఊపిరి పీల్చారు. పుట్టిన ఊళ్ళోనే గుడిసెబడిలో 5వ తరగతి వరకు చదువుకున్నారు. అటుపిమ్మట ఆ ఊరికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న చొప్పదండి

జిల్లా పరిషత్ హైస్కూల్ లో 6వ తరగతి నుండి 11 వ తరగతి వరకు చదువుకున్నారు. కరీంనగర్ ఎస్.ఆర్.ఆర్. కాలేజీలో పియుసి చదువుకున్నారు. జగిత్యాల ఆర్ట్స్ అండ్ సైన్సు కాలేజీలో బిఎస్సీ చేశారు.

ఆ తరువాత భాషాభిమానంతో ఎమ్. ఏ తెలుగు చేయాలన్న ఆకాంక్ష ఉస్మానియా విశ్వవిద్యాలయం వైపు ఆయనను అడుగులు వేయించింది.

డా. పాటిబండ మాధవశర్మ గారు, కోవెల సంపత్కుమారాచార్యులు గారు, కోవెల సుప్రసన్నాచార్యులు గారు, ఆచార్య నాయని కృష్ణకుమారి గారు, ఆచార్య దివాకర్ల వేంకటావధాని గారు, డా. సి. నారాయణ రెడ్డి గారు మొదలగు దిగ్దంతులైన గురువుల అపార వాత్సల్య మార్గనిర్దేశం, తెలుగుభాష పట్ల అమితమైన అభినివేశం తమను తాము శిల్పంగా మలచుకునేందుకు ఆయనకు గొప్ప అవకాశాన్ని, సుహృద్భాగ్యాన్ని కలిగించింది. ఆ జ్ఞాన మూర్తులు పంచిన విజ్ఞానంతో వారికి అక్షరనీరాజనాలు సమర్పించి తమ గౌరవాన్ని చాటుకున్న మహోన్నత వ్యక్తి భూమయ్య గారు.

ఎమ్. ఏ పూర్తి చేయడంతోనే వరంగల్ లోని లాల్ బహదూర్ కళాశాలలో జూనియర్ లెక్చరర్ గా ఉద్యోగం సంపాదించుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ పి.జి. సెంటర్ వరంగల్ లోనే ఉండడం మూలంగా ఉద్యోగం చేస్తూనే 1976లో ఎం.ఫిల్ పూర్తిచేశారు. అదే సమయంలో కాకతీయ యూనివర్సిటీ ఏర్పాటు కావడంతో అందులో తాము మొదటి పి.హెచ్.డి విద్యార్థిగా చేరి, 1980లో పట్టాను అందుకున్నారు. 1983లో అదే యూనివర్సిటీలో రీడర్ గా, ప్రొఫెసర్ గా సక్రమంగా ఉద్యోగ బాధ్యతలను నిర్వహించారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖాధిపతిగా కూడా సేవలందించి, అటుపిమ్మట పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్స్ లర్ గా విధులు నిర్వర్తించి పదవీవిరమణ పొందారు.

ఆచార్య అనుమాండ్ల భూమయ్యగారు బాధ్యతాయుత పదవులనెన్నో చేపట్టి ఎంతో నిబద్ధతతో పరిపూర్ణమైన ఉద్యోగధర్మాన్ని పాటించారు. అదే లక్షణం ఆయన రచనల్లోనూ మనం గమనించవచ్చు. "కొత్త ఆలోచన లేకుండా రాయకపోవడం" ప్రధాన లక్ష్యంగా సాగిన విశిష్ట లక్షణం ఆయన సాహిత్యాన్నిసుసంపన్నం చేసింది. ఆ లక్షణమే ఇతర సాహితీవేత్తలలో ఆయనకొక ప్రత్యేక స్థానాన్ని కల్పించింది. ఆ విధంగా ఇప్పటివరకు వెలయించిన కావ్యాలన్నీ వేటికవే విభిన్నమై సాహిత్యాభిమానులను అలరిస్తూ ఉన్నాయి.

భూమయ్య గారి సాహిత్యాన్నంతా రెండు భాగాలుగా వింగడిస్తే



నాయని సుబ్బారావు కృతులు ఆవిష్కరణ సభలో దాశరథి.

ఒకటి కవితాత్మకం, మరొకటి విమర్శనాత్మకములై సరి సమానంగా తులతూగుతాయి. కవిత్వంలో తిరిగి పద్యం, గేయం అనే రెండు పార్శ్వాలు వ్యక్తమవగా, విమర్శలో సైద్ధాంతికం, భౌమ మార్గం అనే రెండు పార్శ్వాలు దృగ్గోచరమవుతాయి.

కవిత్వం

అనుమాండ్ల భూమయ్యగారి కవిత్వం అసాధారణం. లోతైన అధ్యయనశీలిగా వివిధ కావ్యాలను పరిశీలిస్తున్నప్పుడు ఆయనలో విభిన్నమైన దృక్కోణం వినూత్నంగా ఆవిష్కృతమవుతుంది. అందులో నుండి మరో కావ్యసృష్టి జరుగుతుంది. ఆ కావ్యకన్యక తీరైన రూప లావణ్యంతో పాఠకులను విస్మయపరుస్తుంది. ప్రౌఢపదాలు, దీర్ఘ సమాసాల జోలికి వెళ్లకుండా సామాన్య పాఠకులకు సైతం అర్థమయ్యే అలతి పదాలతో అనల్పార్థాన్ని సాధించడం భూమయ్యగారి మరో ప్రత్యేకత.

మొట్టమొదటగా ఆయన రచించిన "వేయినదుల వెలుగు" కావ్యం ఆ త్రిజగజ్జననికి భక్తి పారమ్యంతో నివేదించిన అక్షరపుష్పం. మెత్తని పట్టువస్త్రాలు పరచుకున్న తన హృదయంపై పాదకమలాలను మోపిన జగన్మాత అడుగుల వెంబడి మాట్లాడే పూలను ఏరుకొని హారంగా మలిచానని భూమయ్యగారు స్వయంగా చెప్పుకున్నారు. పరాత్పరిని నిరంతరం శ్వాసిస్తూ అపారమైన భక్తి భావనతో మాయామోహితమైన ఈ పెనుచీకటిని తప్పించమంటూ..

ఈ దరిద్రపు చీకటినింక ఎంత/ వరకు మ్రగ్గి పోవలయునే, కురియ లేవె / దేవి! నీ పద నఖముల దీప్తి సిరులు?/ ఇంతగా నిరీక్షించిన నించుకైన

అంటూ సంసారమనే చీకట్లను తొలగించుమని ప్రార్థిస్తారు. ఈ కావ్యాన్ని "కవితా కల్హారమాల"గా అభివర్ణిస్తూ శ్రీ గుంటూరు శేషేంద్ర శర్మగారు అనుమాండ్ల భూమయ్యగారిని తల్లి ప్రేమకోసం తృషితుడై ఏడుస్తున్న శిశువుగా భావించారు. "ఆయన శబ్దశారద ద్వారానే ఆయన స్వరం విని కృతార్థులం కావాలని, ఆ స్ఫటిక నిర్మల పేశల వాక్కులలోనే మనం ఓలలాడాలని, అప్పుడే ఆ దివ్యానుభూతిని పొందగలమ"ని కొనియాడారు.

మహాకవి ధూర్జటి "శ్రీకాళహస్తీశ్వర శతకం" లో ...
అమ్మా యయ్య యటంచునెవ్వరిని నేనన్నన్నివా నిన్నునే
సుమ్మీ, నీ మదిఁ దల్లిదండ్రులనటంచున్నాడగాఁబోకు, నా
కిమ్మైఁ దల్లియుఁ దండ్రియున్ గురుఁడు నీవే కాన సంసారపుం
జిమ్మం జీఁకటి గప్పకుండఁగనుమా శ్రీకాళహస్తీశ్వరా!

ఓ శివా! అమ్మా, అయ్యా అని నేను ఎవరిని పిలిచినా సకల జగత్తులోని స్త్రీ పురుష రూపములన్నీ నీవే కావున నిన్ను మాత్రమే పిలుచుచున్నాను. నా కన్నవారిని సంభావన చేస్తున్నానని తలపకు. ఈ దేహానికి తల్లి తండ్రి గురువు అన్నీ నీవే. ఈ సంసారమనే పెను చీకటి నన్ను ఆవరించకుండా కాపాడుమని పరమశివుని వేడుకున్నాడు.

ఇది పరమభక్తుని తాదాత్మ్య స్థితి. ఇహలోకపు బంధనాల నుండి తప్పించుకొని సంపూర్ణంగా దైవాన్ని ఆరాధించే అలౌకిక భావన. అదేవిధంగా ఆచార్య అనుమాండ్ల భూమయ్యగారు పరమ పావని జగన్మాతను తమ ఎదనిండా నింపుకున్న భక్తకవి. ఆయన భక్తి మధురాతి మధురం. అది ఆయన హృదయంలో నిరంతరం తడితడిగా ఊరుతూనే ఉంటుంది.

భూమయ్యగారి ఆధ్యాత్మ తృష్ణ జన్మాంతరాల నుండి కొనసాగుతూ వస్తున్నదా అన్నట్లు తిరిగి "వెలుగు నగల హంస"లో విప్పారింది. అందుకే ఆ రసరమ్య భావనా జగత్తులో ఓలలాడుతూ "మొన్నటివరకు భూమిలో నున్న బీజ / మునయి, దేవి వర్షింప మొల్క నయి, చిగురు / లను తొడిగి ఒక చెట్టునయినాను / వేల పరిమళమ్ముల మూట విప్పినాను" అంటూ ఆనందంలో పరవశించిపోతారు. అనిర్వచనీయమైన అనుభూతిని హృదయపేటికలో గాఢంగా నింపుకొన్న భక్తికి పరాకాష్ఠ ఇది.

భూమయ్య గారి "జ్వలిత కౌసల్య" కావ్యం ఓ అద్భుతదృశ్యం. రామాయణంలో అయోధ్యా పట్టపురాణి కౌసల్య సకలజనుల హృదయాలలో సున్నితంపు ప్రోవు. మాతృత్వపు మాధురీ రసపూత. వినయ విధేయతలకు కాణాచి. ఆమెలోని హృదయాన్ని, స్త్రీ సహజమైన పుత్రవాత్సల్యాన్ని ఆయన కోణంలో ఎవరూ చూడలేరు. తన సవతి కారణంగా కన్న కొడుకు శ్రీరాముడు దుర్గమమైన అరణ్యాలకు వెళ్ళడానికి సిద్ధం కావడంతో ఆమెకు కలిగిన దుఃఖాతిశయం క్రోధంగా మారడాన్ని అత్యంత సహజ సిద్ధంగా వర్ణించారు.

"మరణమే శరణ్యమిక, నీ మాట చెవిన/ బడని బ్రతుకులో నా



గంగిరెద్దు కావ్యకళా వైభవం గ్రంథావిష్కరణ సభ

తండ్రి! పచ్చ ఏది?/ నీ ముఖారవిందము గనని నయనాల / యందు వెలుగేది?వేదన కవధి ఏది?"

అని బాధపడుతున్న కౌసల్యను ఓదార్చడం కోసమే శ్రీరాముడు ఏకపత్నీ వ్రత ప్రతిజ్ఞను చేసినట్టు, తన తల్లికి కలిగిన సవతి బాధను తన భార్యకు లేకుండా చేస్తానని మాట ఇచ్చినట్టు ముక్తాయింపునిస్తారు. ఇది భూమయ్య గారి అసాధారణ ప్రజ్ఞా విశేషం. ఎందుకంటే జన బాహుళ్యంలోకి ఏ రకంగా చొరబడిందో కానీ ఏ రామాయణంలోనూ కనిపించని ఏకపత్నీవ్రత నియమాన్ని ఈ సందర్భంలో ఉపయోగించి తమ ఔచిత్యాన్ని చాటుకున్నారు.

భూమయ్య గారి "మకరహృదయం" కావ్యం ఆయన లోనారసి చూపుకు ప్రతీక. భాగవతంలో "గజేంద్రమోక్షం"భక్తులను కంటతడి పెట్టిస్తుంది. ఆర్త త్రాణ పరాయణుడైన మహావిష్ణువు గజేంద్రుని ఆదుకోవడం ద్రవిస్తున్న హృదయాలను ఊరడింపజేస్తుంది. ఇక్కడే భూమయ్య గారి చూపు ఎవరికీ అందని లోతుల్లోకి ప్రవేశించింది. ఆయన మకరి పక్షం వహించారు. తన స్వస్థలానికి వచ్చిన మరో ప్రాణి తన నివాసాన్ని, తన వారినందరినీ అల్లకల్లోలం చేయడం సహించలేక ప్రతిఘటించిన మకరి తప్పిదం లేదని ఆయన భావించారు.

ఏ తప్పూ చేయని తనను విష్ణువు శిక్షించబూనడం అన్యాయంగా దానికి తోచింది. అందుకే భగవంతుని నిలదీసి, ప్రశ్నించింది.

ఇందులో భూమయ్యగారి సామాజిక దృక్కోణం ఆవిష్కారమవుతుంది. అన్యాయం జరిగిన వారికి న్యాయం జరగాలి. దానికి కారకులైనవారు శిక్షార్హులు కావాలి. ఇది సామాజిక న్యాయం. అందువల్ల ఆ దిశగా ఆయన ఈ కావ్యాన్ని రచించారు. సాహిత్యాభిమానుల హృదయాలను చూరగొన్నారు. ఆహా! అనిపించుకున్నారు.

"నా నివాస గృహమునకు తాను వచ్చి/ అల్ల కల్లోల మొనరింప నడ్డు పడగ/ వలదొ/ ఇదియు నేరమగునొ? వచ్చినట్టి/ వాడు వనరాజు, వాని గర్వమ్ము గనవొ?"

మైసూరు దత్త పీఠం వారి శ్రీ గణపతి సచ్చిదానంద ప్రశస్తిపురస్కారం స్వీకరిస్తూ..

అని ప్రశ్నించడంలో మకరిలోని ఆవేదనను స్పష్టం చేస్తుంది. నిజమే కదా? అని ఆలోచింపజేస్తుంది. మకరహృదయం అని శీర్షిక పెట్టడంలోనే భూమయ్యగారి ఎల్లలు లేని భావనా వైశాల్యం అవగతమవుతుంది.

"ప్రవరనిర్వేదం" లో తమ కల్పనాచాతుర్యంతో ప్రవరుడు తాను చేసిన తప్పిదాన్ని గ్రహించినట్లు, నిత్యమూ తాను ఆరాధించే అగ్నిదేవుని ద్వారా కర్మయోగం నుండి జ్ఞానయోగంలోకి ప్రవేశించి మోక్షమార్గ దర్శకునిగా నిలిచినట్లు భూమయ్య గారు వర్ణిస్తారు. ఈ సాధనలో "కరణేషు మంత్రి"గా ప్రవరుని భార్య సోమిదేవమ్మను కారణంగా చేయడం స్త్రీల పట్ల ఆయనకున్న గౌరవానికి ప్రబల నిదర్శనం. సంసార రథానికి దంపతుల పాత్ర సమతుల్యమన్న వాస్తవాన్ని తెలుపుతూ సామాజిక కోణంలోనూ ఈ కావ్యాన్ని ఆవిష్కరించారు.

ఉపనిషత్తుల సారాన్ని సమస్తం ఆకళింపు చేసుకున్న భూమయ్యగారు "చలువపందిరి" లోనూ "అమృతసేతువు"లోనూ పూర్తి తాత్త్వికతను బోధించారు. తనలో తాను ప్రశ్నించుకుంటూ తానేమిటో తెలుసుకునే ప్రయత్నం చేస్తూ ఆత్మ సాక్షాత్కారం వైపుగా పయనించే స్థితి వీటిల్లో కనబడుతుంది. బహిర్లోక బంధనాల నుండి విముక్తి కాగలిగే పారమార్థిక చింతనతో "హృదయ కావ్య పరమార్థమగు ఆత్మ గానలేనొ?" అంటూ ఆవేదన చెందుతారు. అగ్నివృక్షము, వేదనామృతము, కైవల్య, అరుణాచల రమణీయము, అష్టావక్రగీత మొదలగు కావ్యాలు ఆత్మ, పరమాత్మలకు అనుసంధానంగా జీవుని భౌతికస్థితి నుండి ఆత్మపరిశోధనగా దిశగా సాగేటట్లు చేస్తాయి. ఈ విధంగా విభిన్నమైన నేపథ్యంలో ఆయన రచించిన 17 పద్య కావ్యాలు రసానంద జగత్తులో పాఠకులను మైమరపిస్తాయి.

''కావ్యాలు కాంతా సమ్మితాలు'' అందువల్ల గంభీర భావలోతులను కూడా లలిత సుకుమారంగా అందించడం, వాటిని గేయకావ్యాలుగా మలచడం ఆయనకు కరతలామలకం. మానవుడు తన జీవితంలోఎదుర్కొనే అనేకమైన సందర్భాలలో ఉన్న లోపాలను పరోక్షంగా ఎత్తిచూపుతూనే మరోవైపు వాటిని సరిదిద్దుకునే మోక్షమార్గం చూపే గేయకావ్యం "శాంతిగర్భ". "ధనము ధనము ధన మటంచు/ దరి గానక మునుగునేమో?.." ఆయువునే జీవితమని/ అసలు బ్రతుకు మరచునేమో?" కర్తృత్వము నాదేయని/ గర్వమ్మున తిరిగినేమో?" అంటూ క్షణభంగురమైన జీవితానికై అర్రులు చాస్తూ కోరికలతో రగిలిపోయే అజ్ఞానులను గురించి ఆవేదన చెందుతారు.

తమకు ఆదరాభిమాన పాత్రులైన డా.సి. నారాయణ రెడ్డి గారి సమగ్ర సాహితీ వ్యక్తిత్వ జీవితాలను ఆరు విభాగాలుగా "సినారె వైభవము" పేరుతో ఆవిష్కరించారు. "పద్యరచనతో మొదలిడి/ పారె కవిత గంగ వోలె", "శబ్ద సాధకుండాతడు, శబ్ద శాసకుండాతడు"అని సినారె గారిని ప్రశంసిస్తూ "ప్రాతమార్గములందు సాగుతూ క్రొత్త

వేమన అనుభవసారం ఆవిష్కరణ సభలో..

రీతుల చూపె" నని ఆయనను తలచుకొంటూ మురిసిపోతారు.

ఆది శంకరాచార్యుల వారి "అపరోక్షానుభూతి"ని గేయామృత స్రవంతిగా అనువాదం చేసిన కవివర్యులు భూమయ్యగారు. శంకరుల అద్వైతమార్గంలో మానవుడు "తత్వమసి" అనే విషయాన్ని గ్రహించి, సాధన చేసి జీవన్ముక్తుడు కావాలని అభిలషిస్తారు. ఈ అనువాదం ద్విపదలుగా ఆవిష్కృతమైంది. అద్వైత భావన అనేది సామాన్యమైనది కాదు. అందరికీ సులువుగా అందేదీ కాదు. పరబ్రహ్మలో లీనమైనప్పుడే అది సాధ్యమవుతుందని వివరించడం ఆ తత్త్వ

చింతనలో రమించిన వారికే అవగతం కాగలదు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన గీతాసారం కూడా అదే.

అదే క్రమంలో ఆనంద గీతి, శివానంద గీతి, సౌందర్యలహరి గీతాలు కూడా భౌతిక విషయ వాంఛలను త్యజించి, ఆత్మానందాన్ని పొందే రీతిలో కొనసాగుతాయి. ఏదైతే సుఖమని వెంపర్లాడుతామో అదే దుఃఖహేతువు. వీటిని తొలగించుకున్నవాడే విజ్ఞుడు అవుతాడు. ఈ ఆరు గేయ కావ్యాలు మాత్రా ఛందస్సులో ఒదిగిపోయి ఆనందానుభూతిని కలిగిస్తాయి.

విమర్శ

కవిత్వం నిత్యనూతనం, సృజనాత్మకం. అటువంటి కావ్యానికి నిర్మాణాత్మకమైన విమర్శ చేయడం సులభసాధ్యం కాదు. కవి హృదయాన్ని లోనారసి చూసి నిష్పాక్షికంగా విశ్లేషించడంలో విమర్శకుల ప్రతిభావ్యుత్పత్తులు ద్యోతకమవుతాయి. నిజానికి విమర్శ కూడా సృజనాత్మకమే. ఆచార్య అనుమాండ్ల భూమయ్యగారి



ఆచార్య అనుమాండ్ల భూమయ్య గారి యాభై ఏళ్ళ సాహితీ ప్రస్థానం సందర్భంగా సమీక్షా వ్యాసం..

కావ్యవిమర్శ ప్రత్యేక పంథాలో సాగుతుంది. సాంప్రదాయాన్ని పాటిస్తూనే ఆధునిక కోణంలో కావ్యాన్ని ఆవిష్కరించడం ఆషామాషీ వ్యవహారం కానేరదు. అది భూమయ్యగారికి నల్లేరుపై నడకే. అందువల్లే సహృదయ రంజకములైన రచనల ద్వారా సాహితీ విమర్శకులలో తమదైన మార్గాన్ని ఏర్పరచుకోగలిగారు.

భూమయ్యగారి విమర్శ రెండు పద్ధతులుగా సాగుతుంది. ఒకటి భౌమమార్గం, రెండవది సైద్ధాంతికం. ఆయన విలక్షణమైన విమర్శ శైలీ విధానాన్ని గురించి చేకూరి రామారావు గారు "భౌమమార్గం" అంటూ ప్రశంసించారు. దానినే "Down to Earth Approach" అనే అర్థంలో కూడా చెప్పుకోవచ్చు. క్లిష్టాన్వయం లేకుండా సులభశైలిలో సామాన్యులకు కూడా అర్థమయ్యే విధానం.

శాంతిగర్భ కావ్య ఆవిష్కరణ సభలో డా॥ సి నారాయణరెడ్డి

భూమయ్యగారిని కీర్తి శిఖరాన్ని అధిరోహింపజేసిన ఈ "భౌమమార్గం" అంటే ఏమిటి? ఇది ఒక సంభాషణాత్మక శైలీ విధానం. ఉపనిషత్సారమంతా గురుశిష్యుల సంవాదరూపంలో ఉంటుంది. శుకమహర్షి భాగవతాన్ని మొత్తం పరీక్షిన్మహారాజుకు చెప్పడం మనకు తెలిసిందే. అయితే ఇదే పద్ధతిలోనే భూమయ్యగారు నవ్యతను సాధించారు. ఆయన మార్గంలో వక్త, శ్రోత, ఒక్కరే. ఉపాధ్యాయుడు విద్యార్థులకు బోధిస్తున్నట్లు ప్రశ్న, జవాబులు తానే అవుతూ విద్యార్థి స్థాయిలో సందేహాస్పదమైన అంశాలను వివరిస్తూ కావ్యాత్మను పట్టుకోవడం కష్టతరం. అందులో ఇతివృత్తంతో పాటు కావ్యసొగసులు, పరిమళాలు, కావ్య ప్రయోజనాల నన్నిటినీ వివరిస్తూ కవి ఉదార

డిసెంబర్ 27, 2014న నేటినిజం కార్యాలయంలో మొదటి శతక కవి 'పాల్కురికి సోమనాథుడు' బ్రోచర్ ఆవిష్కరణ సభలో చలనచిత్ర నటుడు కె.రంగనాథ్, ఆచార్య పిల్లల మర్రి రాములు, ఆవిష్కర్త బైస దేవదాసు, బి.యస్.రాములు, 'పాల్కురికి పీఠం' అధ్యక్షులు ఆచార్య అనుమాండ్ల భూమయ్య, ఆచార్య మసన చెన్నప్ప.

మూర్తిమత్వాన్ని విశ్లేషించాలి. అనితరసాధ్యమైన ఈ విశిష్టలక్షణాన్ని సొంతం చేసుకొని ఉన్నత సాహితీవేత్తలనుండి అనేక ప్రశంసలు పొందారు భూమయ్యగారు.

"నాయనితో కాసేపు" అనే కావ్యంలో నాయని సుబ్బారావు గారి కృతులను విశ్లేషిస్తూ ఆయన మీద తమ అత్యంత ఆదరాన్ని ప్రకటిస్తారు. సుబ్బారావు గారి జన్మభూమి, సౌభద్రుని ప్రణయయాత్ర, మాతృగీతాలు, విషాదమోహనం మొదలగు కావ్యాలలోని కవిత్వ మాధుర్యానికి, వాటిలోని ఆర్ద్రతకు చలించిపోయారు.

"పరవశముపో రసజ్ఞ ప్రపంచమెల్ల, ప్రణయయాత్ర వశుడనైతి, జన్మభూమి వశుడనైతి....."అంటూ ఆనందపరవశులైపోతారు.

డా. సి. నారాయణరెడ్డి గారి "కర్పూర వసంతరాయలు" భూమయ్య గారిని ఎంతగా ఆకర్షించిందో చెప్పడానికి ఆయన రచించిన "కర్పూర వసంతారాయలు కథాకళా ఝంకృతులు" అనే కావ్యం నిదర్శనంగా నిలుస్తుంది. ఇందులో కావ్యంలోని కథ, కవిత్వ విశేషాలు, సినారె గారి కావ్యసౌందర్యాన్ని తమ రచనా శిల్ప చాతుర్యంతో వర్ణించారు భూమయ్యగారు.

ఈ కావ్యాన్ని సినారె గారికి అంకితం చేసి సినారె గారి పట్ల తమ వినయశీలతను ప్రకటించారు.

"ఆధునిక కవిత్వంలో దాంపత్యం"లో అంతకుమునుపు ఎక్కడా లేని విధంగా వివిధ కావ్యాలలోని దాంపత్యపు విలువలను వర్ణించారు. హృదయానుగతమైన స్త్రీ ఆలోచనలు, సూచనలు పాటించి తీరాలన్న ఆయన అభిప్రాయంతో స్త్రీల పట్ల ఆయనకున్న గౌరవం మరోసారి నిరూపితమవుతుంది. తెలంగాణ భావ విపంచిక - గోలకొండ సంచిక, వేమన అనుభవసారం, ఆచార్య అప్పాజోస్యుల వారి రచనా వైశిష్ట్యాన్ని వివరిస్తూ రచించిన "పద్యావలోకనం"

రచనలు పాఠకులను అలవికాని ఆనందసందోహాల్లో ముంచేస్తూ భౌమమార్గంలో శోభిస్తాయి. అమేయ భక్తిభావ స్ఫోరకములైన సౌందర్యలహరి, శివానందలహరి స్తోత్ర రాజములలో ఆదిశంకరుల భక్తితో పాటు అందులోని కవిత్వపు రీతులను, సొగసులను దర్శించి, భౌమమార్గం ద్వారా సులభగ్రాహ్యం చేయించిన కవిరాజు భూమయ్యగారు.

ఆయన విమర్శలో రెండవ పార్శ్వం సైద్ధాంతికం. భౌమమార్గంతో విశిష్టలక్షణోపేతులై చెరగని ముద్రను నిలుపుకున్న భూమయ్యగారు సంప్రదాయ విమర్శనా పద్ధతిని అనుసరిస్తూ కూడా అనేక కావ్యాలను అవలోకించి విమర్శనాగ్రంథాలు రచించి తమకు సాటిలేదనిపించుకున్నారు. ఒక కావ్యాన్ని పరిశోధించి విమర్శవ్యాసం రాయడమే

(మిగతా 4వ పేజీలో..)

(3వ పేజీ తరువాయి...)

అగ్ని వృక్షము పద్య కావ్యాన్ని డా॥ సి నారాయణరెడ్డి గారికి అంకితమిస్తూ.









కష్టమైనదంటే కావ్యం మీద వినూత్న పంథాలో మరో కావ్యమే రాయడం అనితరసాధ్యం.

డా. పాటిబండ మాధవశర్మ గారి సూచనననుసరించి కొరవి గోపరాజు గారి "సింహాసన ద్వాత్రింశిక" ను ఎమ్.ఫిల్ కోర్సుగా స్వీకరించిన భూమయ్యగారు దానిని కేవలం సిద్ధాంతగ్రంథంగానే కాక నిశితాన్వేషణాశీలురై పూర్తి కావ్యాంశాన్ని ఎనిమిది అధ్యాయాలుగా క్రమానుగత రీతిలో విస్తృతంగా వివరించారు.

సందర్భానుసారంగా ఇతర గ్రంథాల విషయాలను ఉట్టంకించడం వల్ల ఒక కావ్యాన్ని విమర్శకు తీసుకున్నప్పుడు సందేహాలకు తావులేకుండా సమగ్ర సమాచారాన్ని ఇవ్వడానికి పొందే తపన కనిపిస్తుంది.

దీనితో సంతృప్తి పడని భూమయ్యగారు తదనంతరం "ఇందూరు కవిరాజు కొరవి గోపరాజు" అనే విమర్శ గ్రంథాన్ని రచించి, "సింహాసన ద్వాత్రింశిక"ను పదివిభాగాలలో గోపరాజు కవి రసాత్మకమైన కావ్య నిర్మాణశైలిని, పద్యనిర్మాణ సౌందర్యాన్ని వర్ణించి హృదయానంద భరితులైనారు.

ఇక పి.హెచ్.డి. కోసం ఆయన తీసుకున్న అంశం "నాయని సుబ్బారావు కృతులు - పరిశీలన". ఇది ఒక సిద్ధాంత వ్యాసం మాత్రమే కాదు. సుబ్బారావు గారిలోని భావుకతను, ఆర్ద్రతను, కవితాసౌందర్యాన్ని లోలోతుల్లో స్పృశించిన భావరాశి. "పరిశోధక విద్యార్థులెవరికీ లేని విశిష్ట లక్షణం భూమయ్యద"ని పలువురు ప్రముఖులు అభిప్రాయం వ్యక్తం చేయడం ఆయన పరిశోధనా నైపుణికి దృష్టాంతం. "చిరంజీవి అనుమాండ్ల భూమయ్య మా నాన్నకు అభిమాన పుత్రుడు" అని ఆచార్య నాయని కృష్ణకుమారి గారు ప్రశంసించడం ఆయన రచనా విశిష్టతకు వన్నె తెస్తుంది.

అభూత కల్పనలు, అతిశయోక్తులకు తావీయక సాగిన ఈ సైద్ధాంతిక గ్రంథం నాయని సుబ్బారావుగారి వ్యక్తిత్వ జీవితాలకు చిత్రరూపంలో దృశ్యమై భాసిస్తుంది. తమ పరిశోధనలో సుబ్బారావుగారి రచనలన్నిటినీ వారి చేవ్రాలుతోనే పొందడం భూమయ్యగారి అదృష్టం. నాయని గురించి ఎవరు ప్రశ్నించినా పుస్తకాలు చూడకుండానే సందర్భానుగుణమైన పద్యాన్ని భూమయ్యగారు చెప్పగలిగేవారంటే నాయని వారి ప్రభావం ఆయన మీద ఎంత గాఢంగా ప్రసరించిందో అవగతమవుతుంది. నాయని సుబ్బారావు గారి రచనా వైలక్షణాన్ని, తత్కాల చైతన్యాన్ని, దేశకాలాతీతమైన మానవీయతలను అద్భుతంగా విశ్లేషణ చేసి ఆదర్శ

వేయి నదుల వెలుగు ఉత్తమ పద్య కావ్య పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం వారి నుండి స్వీకరిస్తూ..

సిద్ధాంత గ్రంథాన్ని రూపొందించారు భూమయ్యగారు.

విశ్వనాథ వారి "వేయిపడగలు" నవలలో కథాసూత్రాన్ని పట్టుకొని ఆధునిక ఇతిహాసంగా దాన్ని మలచడంలో భూమయ్యగారు చేసిన అసాధారణకృషికిఎంతగా కొనియాడినా తక్కువే.

సాహితీ లోకమంతా కథానాయకునిగా చేసిన ధర్మారావును కాదని రంగా రావుని కథానాయకుడని చెప్పడం, నిరూపించి చూపడం గొప్ప సాహసకృత్యమే. "ఆద్యుడు కట్టమంచి"లో స్త్రీ

మార్చి 16, 2018న కళా సుబ్బారావు కళావేదికలో ఆచార్య హనుమాండ్ల భూమయ్య సంపాదకత్వంలోని "పద్యాలయము" గ్రంథావిష్కరణలో బైస దేవదాసు, ముఖ్యమంత్రి ప్రత్యేక అధికారి దేశపతి శ్రీనివాస్, తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు డా॥ నందిని సిధారెడ్డి గార్లతో..

ప్రాధాన్యత, శీర్షికా ప్రాధాన్యతను సంతరించుకున్న ముసలమ్మ పాత్రను చిత్రించి, వస్తు నవ్యతను సాధించిన కట్టమంచి వారిని రచనా నవ్యతకు ఆద్యుడని నిర్ద్వంద్వంగా ఋజువు చేశారు.

అభ్యుదయ కవిత్వానికి సంపూర్ణ రూపంగా సాహిత్యకారులందరి చేత ఆమోదింపబడిన మహాకవి శ్రీశ్రీని కాదని "మాలపల్లి" కావ్యాన్ని అభ్యుదయ మహాకావ్యంగా భావించారు భూమయ్యగారు. ఉన్నవ లక్ష్మీనారాయణ గారు ఈ కావ్యంలో అభ్యుదయ భావజాలంతో విలసిల్లి రెండు గీతాలను సహేతుకమైన కారణాలతో చూపించి ఆనాటి ప్రజల ఐక్యతా సూత్రాన్ని వివరించారు.

వట్టికోట ఆళ్వారుస్వామి రచించిన "ప్రజల మనిషి" లోనూ విమర్శకుల చేత కథానాయకునిగా నిరూపించబడిన కంఠీరవం పాత్ర సమాజాభ్యుదయ లక్షణరహితంగా నిరూపించి, సమాజం కోసం నిరంతరం శ్రమించిన గొట్టం కొమురయ్యను కథానాయకునిగా నిలబెట్టారు.

మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి రచించిన "ఆంధ్ర పురాణం" అద్వితీయం, అసామాన్యం. తెలుగునేలను పరిపాలించిన వివిధ రాజవంశీయుల చరిత్ర కలిగిన ఈ కావ్యానికి వస్త్వౌక్యం కల్పించడం భూమయ్యగారు చేసిన అద్భుతప్రయోగం.

దీన్ని ఒక చరిత్రగా కాక భారతీయ సంస్కృతి కోణంలో దర్శించి "ఆంధ్రమహా పురాణం - భారతీయ సంస్కృతి వైభవం"అన్న పేరుతో కావ్యనిర్మాణం చేశారు. ఊహకు అందని విషయవివేచనతో భూమయ్యగారి దృష్టి అంతర్గతమైన నూతన ఆలోచనకు నాంది

సి. నారాయణ రెడ్డి కథా కావ్య సమాలోచనం గ్రంథాన్ని పద్మభూషణ్ డా. కె. ఐ. వరప్రసాద రెడ్డి గారికి అంకిత మిస్తూ..

పలుకుతుందనడంలో అతిశయోక్తి లేదు.

పల్లా దుర్గయ్యగారి "గంగిరెద్దు" కావ్యం సాహితీ చరిత్రలోనే ఒక అపురూపమైన ఆవిష్కరణ.

మూపురం వద్ద మరో కాలు, రెండు తోకలతో అంగవైకల్యం కలిగి, అపహాస్యానికి గురవుతూ ఎందుకూ పనికిరానిదిగా భావింపబడిన ఓ గంగిరెద్దును పూజలందుకునే స్థాయిలో మానవీయ కోణంలో మహత్తరంగా చూపించిన కావ్యం. దీనిని "గంగిరెద్దు - కావ్యకళా వైభవం" పేరుతో మరో గ్రంథంగా తీర్చిన ఘనత భూమయ్యగారిది. "గంగిరెద్దు" కావ్యంలో అపురూపమైన కథావస్తువు, కావ్యశిల్పం, రచనా వైభవం ముప్పేటలుగా అల్లుకొని కావ్యానికి అత్యంత గౌరవాన్ని అందించిన క్రమాన్ని తమ ప్రతిభాపాటవాలతోనిరూపించి, పాఠకుల అంతరంగాన్ని ఆర్ద్రంగా స్పృశించడంలో కృతకృత్యులైనారు.

తెలంగాణ భాషను, యాసను కవిత్వంగా మలచిన నందిని సిధారెడ్డి గారి "తెలంగాణ నాగేటి చాళ్లు" గ్రంథంలోని పల్లె సుగంధాలను నిశిత పరిశీలన గావించి, జానపదుల పద మాధుర్యాన్ని తనివితీరా ఆస్వాదించారు భూమయ్య గారు.

అందరి ఎడదల్లో కన్నీటిచుక్కతో పాటు తెలంగాణ పల్లె తీరుకు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి ఉత్తమ అధ్యాపక పురస్కారం స్వీకరిస్తూ..

ఏం చేద్దాం? అని ఆలోచనా బీజాన్ని నాటిన కవిగా సిధారెడ్డి గారిని ప్రశంసించారు. పాల్కురికి సోమనాథుని జీవిత సంగ్రహం, నాయని సుబ్బారావు లఘుకావ్యం, అనేక వ్యాసావళులు భూమయ్యగారి కరకమలాల నుండి వెలువడిన శిల్ప రమణీయ రచనాకృతులు. పరమ భక్తుల ఆఖ్యానాలతో కూడిన భాగవతాన్ని "భక్త పాలన కళ"గా అభివర్ణించడం ఆయన భక్తితత్పరతకు గొప్ప తార్కాణం.

శ్రీ వేంకటేశ్వరుని పరమ భక్తులైన అన్నమయ్యలోని ఆర్తిని, పదలాలిత్యాన్ని, వెంగమాంబ భక్తిపూర్వకమైన పద సౌందర్యాన్ని బింబ ప్రతిబింబాలుగా "పదమూ - పద్యము" పేరుతోను, అలతి పదాలతో "సీతాన్వేషణము", "వాల్మీకి రామాయణం బాలకాండ కథలు" ఇటీవలే వెలువడి ఆయన ప్రజ్ఞను మరింత విస్తరింపజేశాయి. భూమయ్య గారి సంపాదకత్వంలో వెలువడిన అరుదైన అనేక పుస్తకాలు ఆయనలోని సాహితీపిపాసకు అద్దం పడతాయి.

హైస్కూల్లో భూమారెడ్డి గారి పద్యం చదివే విధానానికి ఆకర్షితులై పద్యం పట్ల అమితమైన ప్రేమను పెంచుకున్నారు.

ఎమ్.ఏ లో దివాకర్ల వేంకటావధాని గారు రాగయుక్తంగా ఆలపించడం చూసి మరింత అనురక్తులై పద్యాన్ని సుస్వర మాధుర్యంగా పాడడంలోకూడా తమ ప్రత్యేకతను నిరూపించుకున్నారు.

భూమయ్య గారి పాండితీ ప్రతిభను మెచ్చి అనేక పురస్కారాలు ఆయనను వరించాయి.

సినారె కవితా పురస్కారం, వానమామలై వరదాచార్య పురస్కారం, మైసూరు దత్తపీఠం వారి నుండి "శ్రీ గణపతి సచ్చిదానంద ప్రశస్తి, సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య పురస్కారం వంటి లెక్కకు మించిన ఎన్నో పురస్కారాలు అందుకున్నారు.

ప్రాచీన , ఆధునిక కవులను గురించి, వారు రచించిన పద్యం, నవల, గేయం, వచనం ఇట్లా వివిధ ప్రక్రియల్లో వారి రచనలను విశ్లేషిస్తూ అక్షర నవరత్నాలు పొదిగిన అమూల్యమైన హారాన్ని తెలుగు భాషామతల్లికి అలంకారంగా అమర్చిన సత్కవితా కిరీటి భూమయ్యగారు.

ఆయన సాహితీ స్వర్ణోత్సవమే కాదు.

మరిన్ని రచనలు చేసి సాహితీ వజ్రోత్సవం కూడా జరుపుకోవాలని మనసారా ఆకాంక్షిస్తూ ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలుపుతున్నాను.

-ధూళిపాళ అరుణ
8712342323



-డా॥రావి రంగారావు
9247581825

2024 జనవరి నుండి ఫేస్బుక్ అమరావతి సాహితీ మిత్రులు గ్రూపులో, వాట్సప్ గ్రూపులో డా రావి రంగారావు సాహిత్యం వర్క్ షాపులు నిర్వహిస్తున్నారు. "ఈ వారం వచన కవితల వర్క్ షాప్" అంశం... "పోలీసు". విజేతల కవితలు చదవండి.

-సంపాదకులు

ద్విముఖ ఖాకీ!

అధికారపు బూటు కింద
చితికిపోతాయి పేదోడి కేకలు!
లాకప్ చీకట్లలో
కరిగిపోతుంది న్యాయం.
పసిడి ఆశల దవుడల్లో
ధర్మం, ఊపిరాడక చస్తోంది!
కంటిని కాపాడాల్సిన రెప్పే
కన్ను పొడిచే కత్తి అవుతోంది!.
అర్ధరాత్రి వీధి దీపమై,
లోకం నిద్రను కాపాడే చేతులే
చీకటి గుమ్మాల్లో,
నోట్ల కట్టల పొగ వెనుక
నేరంతో కరచాలనం చేస్తాయి!
పండగ-పబ్బం మరచి
సంసారాన్ని కంటికి దూరంగా నెట్టేస్తావు..
తీరా తీరం దాటాక,
ఆత్మనే అంగడి సరుకు చేస్తావు!.
రాజకీయపు నీడ పడితే చాలు,
వంగిపోతుంది వెన్నెముక,
సామాన్యుడిపై విరుచుకుపడే సింహం...
పెద్దల ముందర
తోకముడిచిన పెంపుడు జంతువవుతుంది!
బాధితుడి కన్నీరు నేలను తాకక ముందే
కొరడా ఝుళిపించే అదే చేయి...
ఖాతాలో సంఖ్యలు మారగానే
కట్టుకథల సిరాగా మారిపోతుంది!.
ఒకే రూపం!
ఒకవైపు... చెమట చుక్కల కర్మయోగి,
ఇంకోవైపు...
చర్మం ఒలిచి తినే భక్షకుడు!.
రోడ్డుపై ఎండను మింగే శ్రమజీవివి...
అదే రోడ్డుపై,
చిన్న తప్పులకే జేబులు తడిమే దందావి!.
అమాయకుడి చేతికి తొడిగే సంకెళ్లు...
నీ నీతికే వేసే బేడీలు!
సింహంలా ధర్మానికి నిలబడితే...
జనం గుండెల్లో నీరాజనం!
స్వార్థానికి తలవంచి బతికితే...
చరిత్ర పుటల్లో నీచమైన మచ్చ!.
అధికారం శాశ్వతం కాదు...
రూపాయి నోటు నీతో రాదు!
దుస్తుల రంగు కాదు రక్షణ అంటే...
లోపల రగిలే మానవత్వమే,
నిన్ను తరతరాలకూ ప్రజల రక్షకుడిని చేస్తుంది!

-బూరెడ్డి రామకృష్ణారెడ్డి,
7382546949.

ఖాకీ వనం

మర్యాద దుస్తుల్లో
అమర్యాదగా వాళ్ల చేతుల్లో లాఠీ
బూతుల వడ్డిస్తుంది.
గుండె గట్లు తెగి
లంచం డిబ్బీ గల గల శబ్దం చేస్తూ న్యాయాన్ని
అంగడి సరుకు బేరం పెడుతుంటుంది.
భయం భయం గా ఒక్కో మెట్టు
పోలీసు స్టేషనకు
ఎక్కుతున్నప్పుడు
వాళ్ళ కరకు మాటలు
పాదాలకు ఎరుపు బొబ్బలు పూయిస్తాయి
కొరకంచు చూపులు పదునుగా
దేహాన్ని సర్రున కోస్తాయి.
అక్కడ క్రిమినల్సు గూండాలకు
గౌరవాదరాలు పూల దండల సత్కార్యాలు
ఎప్పుడూ స్వాగతగీతాలు పాడుతుంటాయి.
అదో కొత్త దందా లోకం
జేబు బరువుతో న్యాయం
తూగుతుంది..
చట్టం,ధర్మం,న్యాయం
మోకాళ్ళమీద నిలబడ్డ
నిరపరాధ ఖైదీల్లా
ఊచలు మధ్య ఇరుక్కుని
జీవితకాలం శిక్షగా
బేల చూపులు పారేసుకుంటాయి.
ఎన్ని నిరుపేద కంఠాల ఘోష
బూట్లు తొడిగిన యమ కింకరుల
కాళ్ళ కింద కర్కశంగా
చీల్చ బడ్డాయో..
ఇంకెందరు న్యాయస్తుల కన్నీళ్ళు
ఆ టోపీ చాటున ఇంకిపోయాయో..
భద్రమనుకున్న చోట
ఎంత అభద్రతా చీకటి ఎందరిని
మింగేసిందో ..
ఆ ముగింపు కథలు వింటే
దుఃఖం కమ్ముకొస్తుంది.
పోలీసని నమ్మినందుకు
దక్కిన బహుమానం
లా?కప్ డెత్ లు
సంకెళ్ళ ఉచ్చులు ...
లంజా.. లవిడా..అనే
అసమ రూపకాలు..
నామవాచకలవుతాయి.
వాళ్ళు న్యాయానికి ప్రతిరూపాలు
కాదు
అన్యాయాల సెర్చ్ వారెంట్లు
చట్టం పుస్తకాలకు పట్టిన చిమ్మెట్లు

-నేలపూరి రత్నాజీ
8919998753

పోలీసు

అమితాబ్ పొడవు,
కోడి రామ్మూర్తి శరీరం,
ఉసేన్ బోల్ట్ లా పరుగు,
శాస్త్రవేత్తలా పరీక్షలో
పాసైతేనే పోలీసు...
పండుగ జరుపుకుంటున్నా
విందు సగంలో ఉన్నా
అర్జెంట్ అంటే పరుగులు,
నాకంటే మీ వృత్తి కన్యతో
గడపడం ఇష్టమంటూ
ఇంట్లో సన్నాయి నొక్కులు...
యూనిఫాం వేసుకోగానే
కఠినత్వం మోముపై వచ్చి
కరడుకట్టిన దొంగలతో
చెడుగుడు ఆట ఆడేస్తారు...
పోలీసు ఉద్యోగం
కత్తి మీద సాము వంటిదే,
అందుకే తుపాకీతో పాటు
కత్తి లాంటి మనసు...
దొంగకు , పోలీసుకు
పరుగుపందెం పెడితే
కాలే కడుపు ముందు,
అవసరం అలాంటిది!
రౌడీలని పేరుమోసి
లాఠీ దెబ్బలు తిన్నవారు
రాటుదేలిన నాయకునికి
అందదండగా మారిపోయి
కనపడని నాలుగో చాటు
సింహాన్ని బందోబస్తులో
జబర్దస్తుగా బంధిస్తారు!
కర్తవ్య దీక్షతో పనిచేస్తూ
కీళ్ళు విరిచిన చాలు,
శంకరగిరి మాన్యాలకు
వెంటనే దారి చూపుతారు...
సరిహద్దులో సైనికుడైనా
మన హద్దుల్లో పోలీసయినా
పటేల్ స్ఫూర్తితో కలపడం
గాంధీ గారి శాంతి తంత్రం.

-బి.సుబ్రహ్మణ్యం
99086 69424

చట్టానికి ప్రతీక

మనకు రక్షణ కవచాల్ని తొడిగేందుకు
తనప్రాణాన్ని ఫణంగా పెడతాడు,
మన చుట్టూ భద్రతా వలయంగా మారి
తన వారికి దూర మౌతుంటాడు...
మన ఏ.సి. వాహనాల తిరుగుళ్లకు
మండే ఎండలో చెమట చిందిస్తూ
దిశను చూపే నక్షత్ర మౌతాడు...
ఎక్కడ ఏ అవాంతరం వచ్చినా
రెక్కలు కట్టుకు వాలిపోతాడు...
ఊరేగింపుల ఫిడేలుపై అపశృతుల రాగాలు
పలకకుండా వెకిలి చేష్టల తీగల్ని లాఠీతో సవరిస్తూ..
సమాజపు అద్దానికి
పట్టిన స్వార్థపు మకిలిని
క్రమశిక్షణ వస్త్రంతో
తుడుస్తూ ఉంటాడు..
న్యాయ సంస్థాపన యజ్ఞానికై
ఖాకీ వస్త్రాల్ని తొడుక్కున్న నాడే
నిజాయితీ టోపీని నిస్వార్థ ఛత్రంగా నిలబెట్టాలని
ఆకొన్న వారికి అండగా ఉండాలని పూనుకున్నాడు...
అధికార గర్వంతో అవహేళనగా సంఖ్యలతో
సంబోధించి అనుచిత కార్యాల పురమాయింపు
కొరడాలు ఝుళిపిస్తున్నా
తనని నిరూపించుకునే అవకాశపు తలుపు వైపు ఆశగా
చూస్తూ ఉంటాడు..
నిఖార్సైన అధికారి నేతృత్వంలో
తన బాధ్యత బాడ్జీని గర్వంగా సవరించుకుని
వదిలిన బాణంలా ఆదేశాల దిక్కులవైపు
దూసుకువెళతాడు..
రోజుకో జెండా రోడ్డెక్కి
లోపాయికారీ
కార్యాలకు తెగబడుతూ
అల్లర్ల రాళ్లు అడ్డగోలుగా విసురుతుంటే
జనం పక్షాన నిలబడి మౌన ప్రేక్షకుడౌతాడు...
అమాయకుల తలకు ఆరోపణల
తలపాగా చుట్టిన ప్రతిసారీ
చట్టానికి ప్రతీకయైన
లాఠీ తనచేతినుండి పట్టుతప్పాలని
గాఢంగా కోరుకుంటాడు..
పచ్చనోట్ల గుగ్గిళ్లకు కొన్ని అవినీతి లాఠీ
గుర్రాలు
మచ్చికైతే ఎందరివో శాపాల
బాణాలు
తనను గురిపెడుతుంటే
నమ్మకపు రథం ఒక్కోఅడుగు భూమిలోకి
కూరుకు పోవడం చూసి నిశ్చేష్టుడౌతున్నాడు..
తన గుండె చప్పుళ్ళు ప్రజలకు
ధైర్యం ఇవ్వాలని
న్యాయ పోరాటాల చేతిలో
తన లాఠీ వెలుగు దివ్వె వెలగాలని
సతతం పరితపిస్తూనే ఉంటాడు
కనబడని
నాల్గో సింహమై!!

-అమృతవల్లి అవధానం
9052912120

పోలీసు పురాణం

పోలీసుకు అన్నీ తెలుసు..
దొంగ ఎక్కడ ఉన్నాడో తప్ప.
తన వాటా తనకిస్తే దొర..
వాటాలు కుదరకపోతేనే దొంగ.
వీధి వ్యాపారులు
తమ సంచి నింపితే
పోనీలే పాపం
వారూ బ్రతకాలిగా..
అంతులేని ఉదాసీనత.
సంచి నింపకపోతే..
రోడ్డుకు అడ్డంతీసేయ్
విధినిర్వహణలో
ఎక్కడలేని నిజాయితీ.
ఆయన కళ్ళు
చాలా శక్తివంతమైనవి..
హెల్మెట్ లేని కుర్రాడిని
కిలోమీటర్ దూరానే
గుర్తిస్తాయి..
ఎవరి జేబు
ఎంత బరువుందో
ఇట్టే చూసేస్తాయి.
ముందే వెళ్తున్న ఓవర్ లోడు
వాహనాలను గుర్తించలేవు.
ఆయన చేతిలోని లాఠీకి కూడా
తారతమ్యాలు తెలుసు
పేదవాడి మీద నాట్యం చేస్తుంది
పెద్దవాడి ముందు
వంగి నమస్కరిస్తుంది.
స్టేషన్ ముందు పెద్ద బోర్డు -
"ప్రజల సేవకే అంకితం" అని
లోపలికి వెళితే తెలుస్తుంది,



ప్రతి సేవకు ఒక రేటు ఉంటుందని.
కేసు రాయాలంటే
అదొక మహా యజ్ఞం
ముందు నీ ఓపికకు పరీక్ష
తర్వాత నీ జేబుకు పరీక్ష
నిందితుడు దొరికేలోపు
బాధితుడే నాలుగు సార్లు
స్టేషన్ చుట్టూ ప్రదక్షిణ.
సినిమాలో ఆలస్యంగా వస్తాడు
అది నిజం కాదా...
నిజ జీవితంలో కూడా
క్లైమాక్స్ అయ్యాకేగా ఎంట్రీ
ఫోటోలకు బాగుంటుంది.
అయినా అతన్ని
ఏమీ అనకూడదులే
అతను వ్యవస్థ చేతిలో
ఒక లాఠీ "పుల్ల" మాత్రమే
పైనున్నోడు ఆడిస్తే
ఆడే కీలుబొమ్మ
కిందోడు ఇస్తే జోలె పట్టే
ఒక యాచకుడు.

-వక్కలగడ్డ వేంకటేశ్వర రావు
9849559581

165(నేటినిజం ప్రతినిధి):

కృత్రిమ మేధ

స్వంత మేధను మథనం చేయడం
అనాగరికమంటూ
కృత్రిమ మేధతో క్షణాలలో
అద్భుతాలను సృష్టిస్తూ
అంతర్జాలపు అందమైన
తీయని వలలో తమ కలలను
తీర్చుకుంటూ...
దూసుకు పోతున్న కాలమిది...!.
దశాబ్దాల నుండి చాపకింద నీరులా
మెలమెల్లగా, మనిషిని తన చెప్పు చేతల్లో
ఆడిస్తూ, కాలుష్యాన్ని పుట్టించి
పెంచి పోషిస్తున్న ప్లాస్టిక్ లాగా
ఏ.ఐ. కూడా,తన అందమైన
దృశ్య శ్రవణపు తీయని వలలో
సునాయాసంగా ఇరికించేస్తూ
అందరి నరనరాల్లో నిశ్శబ్దంగా
జీర్ణించుకు పోతోంది...!.
అన్ని రంగాల్లో ఆరితేరిన
ఆరిందలా, అజమాయిషీ చేస్తూ
జనులకు కొంత హితం చేస్తున్నా,
ఈ మేధ, నరమేధంగా మారి
మనిషి అసలైన మేధను
దెబ్బకొడుతూ, మొద్దుబారే
అలసత్వానికి దగ్గర చేస్తూ,
సాహిత్య రంగాన్ని కూడా
అంచెలంచెలుగా ఆక్రమిస్తూ,
కృత్రిమ మత్తులో ముంచి
భాషను బెంబేలు పరుస్తూ,
ముప్పు తెస్తుందనడంలో
ఎలాంటి సందేహం లేదనిపిస్తుంది...!
చాట్ జిపిటి అనే ఏ.ఐ. దేవత
కోరిన వారందరికీ అక్షర వరాలను,
అవార్డులూ, రివార్డుల అందలాలెక్కిస్తూ,
అసలు సిసలైన అక్షర మేధావులను
అయోమయంలో
ముంచుతుందనడంలో
సందేహం లేదనిపిస్తుంది..!

-సావిత్రి రంజోల్కర్,
నవీముంబై

సంసారపు కల

కన్నెపిల్లకు కళ్యాణం అయ్యిందంటే
తీయని సంసార వలలో చిక్కుకుంటుంది
కాపురం చక్కగా సాగితే సంతోషపడుతుంది
కాపురంలో కలతలు వస్తే
తీయని కల చెదిరిపోతుంది.
అత్తమామ మంచివారైతే ఆనందపడుతుంది
కట్టుకున్న వాడు తనను బాగా చూసుకుంటే
తానెంతో మురిసిపోతూ ఉంటుంది
సంసార నావ హాయిగా సాగిపోతుంది.
తాను తన వారితో చక్కగా ఉండాలి
సంసారంలో అవకతవకలను తాను సరిచేయగల్గే
చాతుర్యం ఉండాలి
సహనంతో తన కాపురం చక్కదిద్దుకోవాలి
నేర్పుతో తన కుటుంబాన్ని నడిపించుకోవాలి.
తీయని సంసార వలలో చిక్కినా ఆనందమే
కమ్మని కాపురం కోసం తాను కరిగినా సరే
అందరికి తలలోని నాల్కగా ఇల్లాలు ఉన్నప్పుడే
ఆ కుటుంబంలో సుఖ సంతోషాలు వెల్లి విరియును
తన తీయని సంసార కల నెరవేరును.

-అక్కి నర్సింలు గౌడ్

మణిపూసగా

ఓ మగువా!మోసపోవద్దు!
అంతు చిక్కని టక్కరులు ఎక్కువయ్యారు
మంచివారిగా మక్కువ జూపిస్తూ
అలుసు దొరికితే అల్లుకోవాలని
కృత్రిమ నవ్వులు కులాసాగా ఒలికిస్తూ
అదను కోసం ఎదురు చూస్తుంటారు.
మాయ మాటలను మల్లెల్లా కురిపిస్తూ
దగ్గరి తనానికి దారేస్తారు
మగువ మనసుకు నచ్చితే చాలు
వలపులతో తీయని వల వేయాలని
నక్క వినయాలతో
నటిస్తుంటారు .
దారి కాచి దునుమాడేరు
ధైర్య కవచంతో దీశాలిగా మారు
అపర
కాళీ మాతలా అవతరించు
ఆడదంటే అబల
కాదని నిరూపించు.
దాపంత్యంలో అన్యోన్య పతివై
అలరారు!
కన్న కలలను సాకారం చేసుకుంటూ
మానవత్వానికి మళ్ళీ పురుడు పోస్తూ
మహిలో మహిళా మణిపూసగా
మెరువు!!.

-ఆకుమళ్ళ కృష్ణదాస్

కణిక

సాహిత్యం, సామాజిక సేవ,
విద్యారంగ వేదిక
నిర్వహిస్తున్న
'బుధవారం బాధ్వా'
పోటీ ఫలితాలు

అడ్మిన్:రమాదేవి కులకర్ణి
8985613123

నిర్వహణ:
-శ్రీమతి సత్య నీలిమ
సెల్: 95021 56813

తీయని కల

నేటి ప్రపంచము
ఆకర్షణ అనే మత్తులో ఊగులాటతో
సయ్యాటలు ఆడుచున్నది?
యువత తీయని కలలు కంటూ
తీయని వలలు వేసి లాగుతున్నారు?..,
ఆ వయసులో తీయని
ఆకర్షణ,శ్వాస, మరిచిపోలేని
స్నేహాలు మదిలో అల్లుకుని యువతను
జిగి బిగి చేస్తున్నాయి?.,
స్నేహం ఆకర్షణ గా మారి
ప్రేమ మొదలై థీయ్ని
కలలను స్వంతం చేసుకోవాలనే సంకల్పంతో
ఎంతోమంది ఆత్మ హత్యలకు పాల్పడుతూ
వాళ్ళనుకున్న ఆశలు నెరవేర్చుకోలేక జీవితంలో
పరాజ్య పడుతూ జీవితాలు
వెళ్లబుచ్చుతున్నారు?..
వారి తీయని వలలే, తీయని
కలలు కావాలని ఆశిద్దాం.

-వనజ కృష్ణంరాజు .

వ్యాసపూర్ణిమ

గురుబ్రహ్మ గురుర్విష్ణు
గురుదేవో మహేశ్వరః
గురుసాక్షాత్ పరబ్రహ్మ
తస్మైశ్రీ గురవే నమః.

త్రిమూర్తులతో సమానమైన వాడు గురువు. భగవంతుని గురువును అభేదంగా చూస్తాము. హైందవ సంస్కృతిలో గురువుకున్న స్థానం ఉత్కృష్టమైంది.అత్యంత పవిత్రమైనది. మానవ జీవితానికి మార్గదర్శనం చేసి గమ్యం చూపే వాడే గురువు. గురులో "గు" అంటే ప్రపంచ కారణమైన సత్ పదార్థము. "రు" అంటే జ్ఞానము. కనుక గురువు బ్రహ్మ జ్ఞాన స్వరూపము. గురుశిష్యస్థానం అనుబంధం సంప్రదాయం ఎప్పుడు మొదలైందో తెలియదు. వేదవ్యాసుడిని గురువుగా సంభావిస్తారు. కృష్ణం వందే జగద్గురుం అని కృష్ణ పరమాత్మను జగద్గురువుగా పూజిస్తారు. ఆ శ్రీమన్నారాయణుని అంశావతారమైన వ్యాసమహర్షిని మానవలోకానికి అధి గురువు గా పేర్కొంటారు. "మునీనామప్య హంఘ వ్యాసః" అని పరమాత్మ నేనే వ్యాసుడను అని శ్రీమద్ భగవద్గీత విభూదియోగం 33వ శ్లోకంలో చెప్పబడింది.

అచతుర్వదనో బ్రహ్మ
ద్విబాహు రపరోహరిః
అఫాలలోచన శంభుః
భగవాన్ బాదరాయణః "

అని వ్యాసుని గురించి చెప్ప బడింది. వ్యాసుడు అనేది పేరు కాదు అది ఒకపదవి. విస్తృతంగా చెప్పటం వ్యాస లక్షణం. మహా భాగవతంలో చెప్పిన భగవంతుని 21 అవతారములలో వ్యాసుని అవతా రము పదిహేడవది.

పరాశర మహర్షికి జాలరి కన్య ఆయన సత్యవతికి ద్వారా నదీ గర్భాన పడవలో సద్యోగర్భాన ఆషాడ పూర్ణిమనాడు ఆవిర్భవించాడు వ్యాసుడు. పుట్టిన వెంటనే తల్లి అనుమతితో తపస్సుకై వెళతాడు. ఈయనను పారాశర్యుడు అని, సాత్యవతేయుడు అని, వైశంపాయనుడు, కృష్ణద్వైపాయనుడు అనుపేర్లతో పిలుస్తారు. మహారణ్యమువలె ఉన్న వేదరాశిని నాలుగు భాగములుగా విభజించాడు. ఋగ్వేదమును హనుమంతుడు, యజుర్వేదమును వైశంపాయనుడు, సామవేదముని జైమిని మహర్షి, అథర్వణవేదమును పైలుడు స్వీకరించారు. అష్టాదశ పురాణములను, ఉపనిషత్తులను, ఆరణ్యకములను రచించి మానవజాతికందించిన ఆదిగురువు.

సమస్త శాస్త్రాలలోగల ధర్మాలను క్రోడీకరించి పంచమ వేదమని ప్రసిద్ధి చెందిన మహాభారతం మానవులకు అందించినవాడు వ్యాసుడు. మహాభారతంలో చెప్పని ధర్మాలు లేవు. అందుకే ఎవరు ఏ కావ్యాన్ని వ్రాసినా, చెప్పినా వ్యాసుని భావాలే కనిపిస్తాయి. అందుకే "వ్యాసోచ్ఛిష్టం జగత్సర్వం" అనే నానుడి ఏర్పడింది. వ్యాసుడు జ్ఞానప్రదాత, ఆర్ష వాఙ్మయానికి ఆద్యుడు. వ్యాసుని రచనలన్నీ జ్ఞాన ప్రబోధకాలు. అందుకే ఆయన ఆది గురువుగా పూజింపబడుతున్నాడు.

లోకంలో మానవజన్మకు జ్ఞానాన్ని ప్రసాదించి, గమ్యాన్ని లక్ష్యాన్ని చూపించేది గురువే. "అందుకే గురువు లేని విద్య గుడ్డిది" అని అంటారు. అవతార పురుషులు, సర్వజ్ఞులు అయిన శ్రీరామ చంద్రుడు వశిష్ఠుని దగ్గర, శ్రీకృష్ణుడు సాందీపని దగ్గర విద్యార్థులుగా గురుశుశ్రూషచేస్తూ విద్యాభ్యాసంచేసి గురువుయొక్క గొప్పతనాన్ని లోకానికందించారు.

లోకంలో ఆషాఢమాసమును శూన్య మాసంగా పరిగణించి ఎటువంటి శుభకార్యములను చేయరు. కాని ఆమాసమునందే మోక్షకారకమగు తొలిఏకాదశీ తిధి, జ్ఞాన కారకమగు గురుపూర్ణిమలు ఏర్పడి జనులను తరింపజేశాయి. గురుపూర్ణిమనాడు ప్రతివారు తమ గురువులను వ్యాసరూపంగాభావించి సేవించుకోవాలి. గురువు అంటే

"గుకారో అంధకారస్య
ఋకారోస్తనిరోధకృత్
అంధకారస్య వినాశిత్వా
సాక్షాత్ గురురిత్యభిధీయతే"

అని చెబుతారు చీకటిలో వెలుగులు ప్రసాదించేవాడు ఆదిత్యుడు. మనిషిలోని అజ్ఞానం అనే చీకటిని పారద్రోలి జ్ఞానపు వెలుగులను ప్రసాదించి మానవ జీవితానికి సార్థకతను చేకూర్చువాడు గురువు.

"మాతృదేవోభవ
పితృదేవోభవ
ఆచార్యదేవోభవ"

అని తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువుదే. మానవ జీవితంలో తల్లి ఒడి మొదటి బడి. తల్లి తొలిగురువు. తండ్రి నియమశీలన నేర్పే మలిగురువు. మనిషి జీవితమును సుసంపన్నము అయ్యేది సుశిక్షితుడయిన గురువు సంరక్షణములోనే. అందుకే మహానుభావులైన వారందరూ గురు సేవలో తరించి జ్ఞానమార్గం ద్వారా లోకానికి మార్గదర్శకులై గురుస్థానీ యులైనారు. ప్రతివారు గురువు ఆశీర్వాదమును పొందవలెను. అందుకే ఆదిగురువు అయిన వ్యాసుని జన్మదినము అయిన ఈ వ్యాస పూర్ణిమ గురుపూర్ణిమగా అత్యంత ఉత్కృష్టము అయినది.

కస్తూరియట చూడకాంతి నల్లగా నుండు
పరిమళించు దాని పరిమళం
గురువులైన వారి గుణము లీలాగునుండు

అన్నారు. కస్తూరి చూడటానికి నల్లగా ఉంటుంది కానీ దాని పరిమళము సుగంధమును కలిగి ఆనందాన్ని కలిగిస్తుంది. కస్తూరి పరిసరాలన్నింటిని ఎలా సుగంధ భరితం చేస్తుందో అలానే మానవ జీవనగతికి, ఆధ్యాత్మిక ప్రగతికి గురువు అనుగ్రహం, ఆశీర్వచనం ఎంతైనా అవసరము.

కస్తూరి చూడటానికి నల్లగా ఉంటుంది కానీ దాని పరిమళము సుగంధమును కలిగి ఆనందాన్ని కలిగిస్తుంది. కస్తూరి పరిసరాలన్నింటిని ఎలా సుగంధ భరితం చేస్తుందో అలానే మానవ జీవనగ తికి, ఆధ్యాత్మిక ప్రగతికి గురువు అనుగ్రహం, ఆశీర్వచనం ఎంతైనా అవసరము.

-డా.మైలవరపు
లలితకుమారి
9959510422

అల్లుడికీ అంకితం ఈ హృదయాంజలి

పుస్తక సమీక్ష

ప్రేమ ఎప్పుడూ ప్రేమనే ప్రేమిస్తుంది, ప్రేమ ఎపుడు ఏదైన సాధిస్తుంది, ప్రేమ పరశబ్దమే వీనులకు విందు, ప్రేమ అన్నదొ క్కటే అందరికీ చెందు అంటూ గానం చేస్తుటే, అటు అమ్మ త్యాగమూ, ఇటు నాన్న శాస నమూ, గురువు యొక్క జ్ఞాన జ్యోతి ప్రేమను నిండుగా దీవిస్తుంది. భర్త ప్రేమ, భార్యకు కావాలి, భార్య ప్రేమ భర్తకు సుఖ జీవన రక్ష అన్న ప్రేమ అమృతపు జల్లు, చెల్లి ప్రేమ అన్నయ్యకు ఆనంద హరివిల్లు. యుగాలెన్ని గడిచినా పవిత్ర ప్రేమ చరిత్రలో నిలిచిపోతుంది, ప్రణయకావ్య పుటల్లో చేరిపోతుంది అంటారు జనార్ధన్. కన్న తల్లి హృద యమూ, అమ్మ మనసు, మాతృదే వోభవ, కరుణించే దేవత అమ్మరా, అమ్మంటే వంటి గీతాలు జనావళిని ఇట్టే ఆకట్టుకుంటాయి. ఒక గీతం రాణిం చాలంటే ఆ పాటకు సంగీతాన్ని సమకూర్చి, మంచి గాత్రం వున్న వాళ్లుపాడాలి. అప్పుడే అది రాణి స్తుంది. నాన్న గురించీ, తల్లిదం డ్రుల గురించీ "జనశ్రీ" రాసిన గీతాలు చాలా బాగున్నాయి. గురువంటే ఓంకారం, గురు వంటే శ్రీకారం, గురుశిష్యులవల్లనే సర్వజ్ఞాన సాకారం అంటూ ఈ జగతికే వెలుగు గురువు వల్లె కలుగునంటారు.



ప్రతులకు: జనశ్రీ
జనార్ధన్ కుడికాల ఇ.నెం.7-1-47,ఫ్లాట్ 402రత్నదీప్ రెసిడెన్సీ బాలసముద్రం, హన్మకొండ తెలంగాణ-506 001
సెల్: 9703275050

గురుశక్తి గొప్ప దా, అంటూ ఒక ప్రశ్నను లేవనెత్తి, చివరకు తానే గురు శిష్యుల బంధము అన్నింటికన్న మిన్న అంటూ తేల్చేశారు. జ్ఞానజ్యోతి వెలిగించే గురువు మనకు దేవుడు అంటారు.

మాతృభక్తి, పితృభక్తి, గురుభక్తి గీతాలు, పిల్లలూ, పెద్దలూ హాయిగా పాడుకోవచ్చును. అంతా బాగున్నాయి. ఈ 'జనశ్రీ గీతాలు' అల్లుడికి అంకితం గావించారు.

- డా॥ పులివర్తి
కృష్ణమూర్తి
సెల్:9949092761

కవితార్చన

అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

-సంపాదకులు

గణనాయకా!

భాద్రపద శుద్ధ చవితికి
యేటేట వచ్చేవు మా ఇంటికి
నీ రాకతో మా ఇల్లు పావనమయ్యేను
నీ పూజలతో మాకేమె?
మనసు నిండేను!.
ఓ బొజ్జ గణపయ్య నీ బంటు
నేనయ్య అంటూ ఉండ్రాళ్లు
సమర్పించేము మా ఇంట మా
వీధి అపార్ట్ మెంట్లన్నీ పులకరించేను!.
నిమజ్జన వేళ మా మనసులన్నీ
బాధతో నిండేను మళ్లీ రావయ్య
వినాయకా అని నీకు మ్రొ?క్కేము
మళ్లీ వస్తావని మాకోరికలు తీర్చాలని!.
మా స్వార్థంతోనే నిన్ను కొలిచేము
కానీ నువ్వు మాత్రం నిస్వార్థంగా
మా కోరికలు తీరుస్తున్నావు స్వామి
మమ్మల్ని కరుణిస్తున్నావు దేవా!.
మళ్లీ మళ్లీ మాకు అభయమిస్తూ
ఆశీర్వదిస్తున్నావు నీకోసం వేచి
చూస్తాము స్వామి నీ పూజలు
చేసుకుంటాము మా మెనదటి దేవా!

-ఎర్రం ఉమాదేవి

మమ్మల్ని చల్లగ చూడంగా

మబ్బుల తోటల నుండి దిగిరా... గణనాథా,
మువ్వల సందడి హృదయాన నింపగా!
చిరునవ్వుల కాంతులు కురిపించరా,
అనురాగాల వర్షమై మురిపించరా!
తొలి పూజల తొలి ప్రేమవు నీవై,
ప్రతి ఆరాధన మమతగా మార్చావు!
ఏడుకొండల సామికి ప్రియమైన దేవా,
నీ చూపులతోనే ప్రేమ వెలిగించావు!
కరిగే మట్టిలో కొలువున్న రూపమా,
వీడ్కోలు చెప్పక నీలోనే కలిశాముకంటిపాపవై
కాపాడే దివ్య ప్రణయమా,
నీ దివ్య మూర్తిని నిత్యం తలచేము!
విఘ్నాలు తోలే వెలుగువు నీవై,
వలపే నీపై నిలిపి బ్రతికేము!
ముద్దుల గణపతి మళ్ళీ దిగిరావేలా,
మాలోని ప్రేమను నీపై కురిపించగా!
మళ్ళీ రావయ్యా
మా గుండెల్లో నిలవడానికి,
శాశ్వత ప్రేమకు సాక్ష్యమై
వెలగడానికి!

-డా.భరద్వాజ
రావినూతల

ఆలకించు మా విన్నపం

ప్రతిరోజూ నీ పూజలతో పరవశించి...
పిల్లా పాపలతో నిను కొలచి
ప్రశాంతంగా చేసాము నీ పూజలు
మాలోని పాపాలు తొలగించి పోతున్నావా?
నీ రాకతో మా ముంగిట వెల్లివిరిసిన
ఆధ్యాత్మిక అమృతవాహిని లో
తిరుగాడిన మా హృదయాల్లో
భక్తి భావం నీ పూజలతో నింపావు
అపార్ట్మెంట్ల లో ఐకమత్యం నింపావు
నీకోసమే అందరూ కలిసి
ఆడారు, పాడారు
మళ్ళీ నీవు రావాలనే కోరిక మాది
తొలి పూజలందుకునే దొరవు నీవు
ఓ బొజ్జ గణపయ్యా అంటూ నీకు
పంచాము కుడుములు, ఉండ్రాళ్ళు
నీ నిమజ్జనం రోజున
కలిసిపోతున్నావు నీటిలో...
మాలో అసూయ తొలగిస్తూ
మళ్ళీ రావయ్యా గణనాథా!

-షామీర్ జానకీదేవి
9394611037

పని ముట్లు

గోదారి వరద పోటు తో
కన్నీట మునిగిన భద్రాచలం
పంట పొయ్యి ని..
ఎలినీనో కరువుచేటు తో
కుంగిన తెలంగాణ పొలం గొయ్యిని..
కుర్చీలోళ్ళు మరిచిపొయ్యిన్రు.
కుర్చీల ఎత్తుగడల దెబ్బకి
రివర్స్ పంపింగ్ ఎత్తుగడలుతడబడ్డాయ్
పొలాల్ని నమ్ముకున్న నాగళ్ళు డీలా పడ్డాయ్
నాగటిచాళ్ళ ను నమ్ముకున్న కొడవళ్ళవ్రేళ్ళు
మూలన పడ్డాయ్.
జిల్లాల ఎల్లలు దాటేస్కుని
కలిసిబతికేద్దామనుకుంటే
తీగలవాగు దోస్తానీ రస్తా కాస్తా
ముడతలతో అణిగి పోయింది
ఎత్తైన కొత్త సత్తా లేక చిన్నబోయింది.
రెక్కల కష్టాన్ని అమ్ముకుందామంటే
ఇసుకదందాలు పనులకు బొందపెట్టాయి
కూలీ డబ్బుల్ని నమ్ముకుందామంటే
'సిరిసిల్ల-పిట్లం'రాదారి షురూకాదాయే
గణపతి బప్పాకి పండక్కి
కుడుములు ఉండ్రాళ్ళు లేకున్నా ఃపరేషాన్ లేదు.
ఇంట్లోని పోరగాళ్ళకి
జరసల్లగ ఈపూటకి
ఆకలి తీరడాన్కి
బువ్వ దొరికే దారిలేదు
రేపటికి కుండలోకి నూకలూ,కూరగాయలు
జమ అయ్యే భరోసా లేదు.
దోశడంత వరం ఇచ్చిన తల్లిని
గోరంత గురుతు పెట్టని
కుర్చీలోళ్ల తప్పుల్ని
అమ్మోరు తల్లి ఒగ్గేసింది!.
వోట్లపనిముట్లను .
తన బిడ్డలకు ఇచ్చేసింది!!

డా॥గాదిరాజు మధుసూదనరాజు
9703316760

నేను

నేను నేంటావు
నేను అంటే మేను అనా?
మేనులోన జీవమనా?
ఆయువు వాయువులో కలిస్తే
కట్టెను కట్టెలతో కాలిస్తే
మిగిలే బూడిద అస్థికలు
గంగలో కలిస్తే
నేన ఉనికి ఎక్కడో..

సోమయాజుల సుబ్రహ్మణ్య శర్మ
సెల్: 93466671524

తప్పు ఎవరిదీ?

బాహ్మ పదార్ధ వేటకై
బందిఖానలాంటి బడుల్లో వేసి
ప్రేమానుబంధాలకు దూరం చేసి
బహుళజాతి కంపెనీలకు
యంత్రాలను తయారుచేయాలనుకునే
తల్లిదండ్రులది కాదా? తప్పు.
ఆకతాయిచేష్టలు,అల్లరి ఆటలు
అశ్లీలనృత్యాలు ఐటమ్ సాంగులు
తూటాలు తుపాకులు
మాదకద్రవ్యాల మందు విందులు
నీయయ్యాతగ్గేదేలేదనే తీటమాటలు
చిల్లరమూటల చీకటి బ్రతుకుల
విందుభోజనాల సినిమాలది కాదా?తప్పు
నిఘావర్గాల కళ్ళు కప్పి
నీతి నియమాలను తుంగలో తొక్కి
గల్లీగల్లీలో గంజాయి మూటలు మోస్తూ
మాటు వ్యాపారాలు చేసే
నీటుగాళ్లది కాదా?తప్పు.
రాజకీయులదే రాజ్యమన్నట్టు
పాలక ప్రతిపక్షాలే ప్రపంచమైనట్టు
ప్రజా సమస్యలు అసలే లేనట్టు
ప్రత్యక్ష ప్రసారాలపై పరోక్ష వ్యాఖ్యలు చేస్తూ
ప్రాపగండ సుడిగుండాలను సృష్టిస్తున్న
మీడియా మాధ్యమాలది కాదా? తప్పు
అరచేతిలో ఆటంబాంబు పెట్టి
ఇంటర్నెటును ఇంధనం చేసి
మనుషులను మరబొమ్మలుగా చేసి
ఏఐతో టిగర్ నొక్కుతున్న
సామాజిక మాధ్యమాలది కాదా?తప్పు.
ఆర్థిక వనరుల అవసరార్థం
అడుగడుగున లభ్యమయ్యే మద్యం
ఆటవిక చర్యలకు కాదా ఊతం
అడ్డు చెప్పలేని,అదుపు చెయ్యలేని
ప్రజా యంత్రాంగానిది కాదా? తప్పు.
ఈ ఉక్కపోత సమయంలో
ఉలికిపడే సమాజమా కాదు కాదు!
ఉలుకు పలుకు లేని మొద్దు
సమాజానిది కదా! అసలు తప్పు...?
(రూపారెడ్డి
ఉపాధ్యాయురాలు. హత్యకు
నిరసనగా)

-డా॥ఎడ్ల కల్లేశ్
9866765126

వంశోద్ధరణ

ఇప్పుడే !
ఈ ప్రయాణం ప్రారంభం కాలేదు
దాదాపు శతాబ్దం క్రితం బీజం పడ్డది
అచ్చు అతుకుతూ
పడుగు పేకలు సరిచేస్తూ
మా తాత నేసిన అందమైన
నూలు వస్త్రాల కలల పంటను.
రాట్నం తిప్పుతూ
కండెలు చుడుతూ
రంగు రంగుల లడీల
చిట్టెల చిక్కులు పాపుతూ
మా నానమ్మ ఊహా లోకంలో
చిగురించిన పచ్చని జరి అంచు చీరను.
తినీ తినక
ఉప్పిడి ఉపవాసముండి
నమ్ముకున్న వృత్తిలో
ఆనందం వెతుక్కుంటూ
మా నాయిన నిర్మించుకున్న
ఆశల పుప్పొడి అద్దుకున్న తువ్వాలను.
పుట్టినింట్లో మెట్టినింట్లో
ముందు వెనుక ఎమిలేకున్నా
అనుబంధాలు పోగుల్లా తెగిపోకుండా
మా అవ్వ 'సరి'చేసి సవరిచ్చిన
గీతల తలపాగను.
ఉండి లేక
నలుపు తెలుపు స్థితిగతులతో
బతుకుబండి లాగుతున్న
నా తోబుట్టువులకు ఊపిరి దారాన్ని
అటూ ఇటూ తిప్పుతున్న సట్టర నాడెను.
ప్రతిభను గుర్తించి
తెలివికి పదును పెట్టిన
గురువుల అంచనాలను
వికసింపజేస్తున్న
పువ్వుల నక్షత్ర పింజరను.
నేను
జ్ఞాననదీ ప్రవాహమును
దారులు కనిపించకపోయినా
కొత్తదారులు వేసుకుంటూ
పిల్ల కాల్వలను కలుపుకుని
ప్రయాణిస్తున్న బాటసారిని
ఈ ప్రస్థానం
అనంతం
ఆచంద్రతారార్కం !

-జిందం అశోక్
8978532225

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1886వ రోజు 'కన్యాదానం' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'కన్యాదానం' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

-సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం

అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:

-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839

కన్య ఆదానం

కన్నపిల్లను
కంటికి రెప్పోలే పెంచి
ధనకనక వస్తు వాహనాలతో
అత్తింటికి పంపించి
పిల్లను దానం చేసే కాలం నాడు
తల వంచుకుని
అడవి దారి పట్టిన నాటి యుగం
అడవులు మాయమైన నేటి
యుగం!!.
బుడ్డ పిల్లను ముసలోడికి
కట్టబెట్టి వాడు చస్తే
పుట్టింట్లోనే విధవగా
గొడ్డు చాకిరి చేయడమే కాదు
ఆమె ఆస్తిని కూడా
స్వాహా చేసిన పుట్టింటి వాళ్ళు
అందుకే ఆడపిల్ల సొమ్ము
తినొద్దనే సామెత
ఆ కాలం పోయే
ధర్మం మారిపోయే!!.
కన్యా దానం కాదు
కన్య ఆదానం
కన్య ఆదానం
కొనుక్కోవడం కల్ల
అమ్ముకోవడం డొల్ల!!.
ఆడపిల్ల దొరుకుడే లేదు
దొరికినా అనుకున్నట్టు
వుండేది ఏడనో
ఆడపిల్లనే ఉల్టా
వీళ్ళే సంపాదించి పెట్టుడు!!.
పెళ్ళిళ్లు చేసే స్థితి మారి
తనే ఇష్టమైనోడితో
పంచుకోవడం మేన్ .
రెండు చేతులా కాదు సంపాదన
నాలుగు చేతులా కాసులు
స్వేచ్ఛా విహారం
దానం చేసి
చేతులు దులుపుకునే కాలం
కాదు
కన్నీరు కార్చి
ఖర్చు పెట్టేది లేదు
అయినా ఆగని పెళ్లి తంతు
కన్యాదానం గొప్పఫలం
దక్కే వారికి యోగం!!.
ఇద్దరికీ కన్యాదానం చేసిన
ఫలితం
దక్కించిన బిడ్డల మంచితనం
గతజన్మలో చేసిన పుణ్యఫలం!!.
యుగం మారినా
ధర్మం మారదు
ఎంత అనుకున్నా
ఒక అయ్య చేతిలో
ఆయాసం లేకుండా పెట్టుడు
యాష్ట పడకుండా
నడువు అని చెప్పుడు!!.
ఎంతైనా ఆడపిల్ల
ఆడ పిల్లనే!!.

-డా. చీదెళ్ల సీతాలక్ష్మి

పసిపాప పెరిగి పెళ్లి వేళదాక

పుట్టినప్పటి నుండి
అమ్మానాన్నల
కంటికి రెప్పలా పెరిగి
ముద్దు బిడ్డ తానై
మురిపించింది ఆట పాటలతో.
నట్టింట్లో తిరిగే పసికూన తానై
తీయని మాటలతో
మురిపాలతో
తల్లిదండ్రుల మనసులో
నిలిచింది నిండుగా.
బొమ్మలతో ఆడుతూ
తిరుగుతున్న బాల్యం
నవ్వులతో మురిపించిన
చిట్టి తల్లి
నవ్వితే నాన్న మనసులో
ఆనందం
చిట్టి తల్లి నీవని పులకరింత.
అట్లట్లా పెరిగి పెద్దైతే
పెళ్ళీడు పిల్లకు చూసిండ్రు
పిల్లోన్ని
వరకట్నం ఆశలేదు
పిల్ల బుద్ధి గుంటేచాలు
అనుకున్నాడు బుద్ధిమంతుడు.
ఊరంతా పందిరేసి
మా అమ్మాయి పెళ్ళని
చూడచక్కని జంటకు
అక్షంతలేశారు
తల్లిదండ్రులు
కన్యదానం చేసి
సాగనంపేటప్పుడు
అమ్మాయి బుద్ధి మంతురాలు
మనసులో పెట్టుకొని చూసుకో
ఏ లోటూ లేకుండా
పెంచామల్లుడా
నువ్వు కూడా మాలా చూసుకో
అంటూ తల్లి దండ్రుల కన్నీటి
బాధలు
ఎరుకలేని వారెవరు?!
కన్యాదానం కన్నా
గొప్ప దానం మరొకటి లేదుగా!

- వి.సంధ్యారాణి

గౌరవప్రదం

ఆకలిగొన్న వారికి అన్నదానం
దున్ని పండించుకుందుకు
భూదానం
తనువుని దాచి రక్షించేందుకు
వస్త్రదానం
జ్ఞానాన్ని పెంచి
ప్రయోజకుడిని చేయడానికి
విద్యాదానం
వంశాన్ని పెంచి
వికసింప చేయటానికి కన్యాదానం
ఏ దానానికాదానమే గొప్ప.
తప్పిస్తాయి అనేకానేక విపత్తులు.
ఒక ఇంటి వెలుగైన కన్యకారత్నం
మరో ఇంట వెలిగిస్తుంది
దాంపత్యదీపం,
దానంలో పాత్ర దానం విశిష్ఠం
ఉభయకుశలోపరి.
కన్యాదానాలతో
ఇరువంశాల సంస్కృతీ
సంప్రదాయాల
పరస్పర ఆదర సన్మానాలు
అవగాహన సర్దుకోవటాలు
నిరహంకార ఆత్మీయ
సంబంధాలు
ముఖ్యం- అతిముఖ్యం.
పరించినవాడు
వధువుతోడ
నూరేండ్ల సుఖశాంతుల జీవనం
సాగిస్తామని వేదోక్త మంత్రాల
విప్ర సకల దేవీ దేవతల సాక్షిగా
పాణిగ్రహణాన చేసే ఒప్పందం.
దాంపత్యమహా యజ్ఞంలో
ప్రకృతి పురుషుల సంగమంతో
సృష్టి స్థితులకు తోడ్పడే
బృహత్కార్యం కన్యాదానం.
ఆధునికతల
ఆడంబరాల
అహంకారాల
ఆపోహల
కన్యాదాన పవిత్ర కార్యాన్ని
భ్రష్టు పట్టించక
సనాతన ధర్మనిరతులై
ధర్మాచరణప్రేరిత కన్యాదానాన్ని
గౌరవప్రదంగా
స్వీకరించడం శ్రేయస్కరం.

-రాజప్ప

కాలం మారిందయ్యో!

కాలం జమానా
మారిందయ్యో!
దాన మీయనీకి
ఆడపిల్ల ఏమైనా వస్తువా?
లగ్గం పేరుతో అగ్గువగా
పెండ్లిబిడ్డని ముసలోనికి
కట్టబెట్టనీకి పున్యమొస్తదని
సేసిన లగ్గాల కాలం
మాయం.
మాకూ మనసుంది
నచ్చినోడిని సేసుకునే
హక్కుండాది.
సీతారాములోరి కతలు మాకొద్దు
సీతమ్మోరు సన్నపాప
రాములోరికిచ్చి కన్యాదానం
ఒడిబియ్యం పోసిన కతలు
మాకొద్దు.
రుక్మిణమ్మ ఎంసక్కా
కిట్టయ్య తో రథమెక్కి పోలేదా!?
బడిలోనే దేవులాడి
నౌకరీ రాగానే
నచ్చినోడితో లగ్గం
అమ్మ అయ్య
నెత్తినోరు బాదుకుంటే
మాకేమి? మీకేమి?.
వరవిక్రయం నాటకంల
కాళింది లెక్క
ఆత్మహత్యలు లేవీడ
సదువు నౌకరీతో
ఆడబిడ్డలకు రెక్కలొచ్చి
ఎగిరిపోయే దినాలు
లగ్గమాడనీకి పిల్ల దొరక్క
కుర్రోళ్లు అలో లక్ష్మణా అంటూ
యాస్టపడుతున్న రోజులల్ల .
పిల్ల పిలగాడు
చాటింగ్ బోటింగ్తో
దావత్తుకి
కన్నోళ్లని పిలిసేటి రోజులాయె
ఇంటి నుంచి పారిపోయి
"ఇస్టముంటే రాండ్రి
లేకుంటే సప్పుడు సేయకుండ్రి"
అని ఆడపిల్లలు సెప్తున్న రోజులు.
అందుకే పెద్దలు ఘొల్లుమంటూ
గొడవ పెట్టక గప్ చుప్
పెళ్లి కర్చుండదు
ఏడ్పులతో సాగనంపుడు
లేని కాలం.

-ఎ.రాజ్యశ్రీ

కన్యాదానమా! నీవెక్కడ?

కన్యాదానం
ఎక్కడుంది ఇప్పుడు?
అటు ఏడు
ఇటు ఏడు తరాలు చూసి
సాంప్రదాయాలు పడిగట్టి
పెద్దలు వరకట్నంతోపాటు
కన్యను దానం చేసి
సుముహూర్తంలో చేసే
పెళ్లిళ్లు కానరావు!
ఉగ్గుపాల నుండి ఊయల వరకు,
నడకల నుండి చదువుల వరకు
ఉద్యోగం నుండి పెళ్లిళ్ళ వరకు
కన్నవారి కష్టాలెన్నో చెప్పలేం!
గుండెల మీద
కుంపటి దించుకోవాలని
ఓ అయ్య
చేతిలో పెట్టేది కొందరైతే,
పెళ్లయ్యాక పిల్ల ఎలా ఉందో
చూడని కొందరు!
ఆదర్శ వివాహముంటూ
కట్నం తీసుకోక
ఆనక అగచాట్లు పెట్టేవారు ఎందరో!
ఆడపిల్ల అక్కడి పిల్ల అంటూ
అపరిచిత వ్యక్తుల మధ్య విసిరేస్తే
కోడల్ని రాచి రంపాన పెట్టే అత్తలు
ఆడబిడ్డల ఆగడాలను
అడ్డుకోని భర్తలు
ఉంటున్న రోజులు
పోయాయి ఇప్పుడు!
కాలం మారింది
నేటి యాంత్రిక యుగంలో!
పెద్దలు
సంబంధాలు చూసే పనిలేదు!
లగ్నాలు పెట్టే పని అసలే లేదు!
ఏళ్లపాటు సహజీవనం చేస్తూ
నచ్చక పోతే
విడాకులు తీసుకునే కన్యలు!
సహచరులను మార్చే
చలాకీ భామలు ఎందరో!
అన్నదానాలు అడుగంటాయి!
భూదానాలు అసలే లేవు!
కన్యాదానమా! నీవు ఎక్కడ?
కనుచూపు మేరలో కనబడవేం? .

-కోలా సత్యనారాయణ

సప్త పదులు

ప్రక్రియా సృజనకర్త:
సుధామ
సెల్:9849297958

పిలవాలి
నిలవాలి

మంచిగా
జీవించాలంటే
సమాజంలో
నలుగురితో కలవాలి

-పంతుల లలిత
విశాఖపట్టణం

వినియోగం
అభియోగం

కలుపుకు పోవడమే
యోగం,
విభజించడమే
వియోగం.

-యదుగిరి క్రాంతి రామ్మోహన్, హైదరాబాద్

మారనిది
జారనిది
పుట్టింటిపై
బెంగ, మమకారం,
జీవితాంతం
తీరనిది.....!!

-శ్రీమతి భారతీకృష్ణ
హైదరాబాద్

చూసుకోవాలి
రాసుకోవాలి

కష్టసమయాన
మనలోని
ఆత్మశక్తిని
గుర్తు చేసుకోవాలి.

-శ్రీమతి ఎస్. కమలా దేవి,
హైదరాబాద్.

గీతలు
తలరాతలు

దుష్కర్మలు
సత్కర్మలతోనే
మారును
నీ విధివ్రాతలు..

-పద్మావతి పి.
హైదరాబాద్

నడవాలి
మురవాలి

అమ్మా నాన్నలకు
పిల్లలు
ఆసరాగా
నిలవాలి

-కాయల నాగేంద్ర,
హైదరాబాద్

అంతకారి
అంధకారి

ఉపకారి
కాపోయినా
ఎప్పుడూ కాకూడదు
అనర్థకారి

-విత్తనాల విజయకుమార్
హైదరాబాద్

దేవరా
లేవరా

పెడదారి పట్టిన
మనుజుల
నడవడిని
కావరా

-మోదుగ బాలసుబ్రహ్మణ్యం
గుంటూరు

పుణ్యవంతుడు
బుద్ధిమంతుడు

భావావేశాలను
అర్థం చేసుకునే
నిరక్షరాస్యుడు
జ్ఞానవంతుడు.

-కె. ఎం. కె. మూర్తి
సికింద్రాబాద్

వ్యక్తి
శక్తి

మోసం
నుంచి బయట
పడేందుకే
యుక్తి

-కె. వి. వి. సత్య ప్రసాద్
మండపేట

కాలానికి నిలిచే కవిత్వం రాసిన పాశం రెడ్డి - మౌనశ్రీ మల్లిక్, సినీగీత రచయిత

పుస్తకావిష్కరణలో అతిథులు.

హైదరాబలాద్, సెప్టెంబర్ 23:జూబ్లీహిల్స్ లోని రూట్స్ కాలేజీ ఆడిటోరియంలో, ఆదివారం జరిగిన సాహిత్య సభలో పాశం రెడ్డి రచించిన 'నగ్న వృక్షం' కవితా సంపుటి ఆవిష్కరణ జరిగింది. శ్రీశైల రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ కవి, సినీగీత రచయిత మౌనశ్రీ మల్లిక్, చేపూరు సుబ్బారావు, వి.కె. ప్రేమ్ చంద్ హాజరై గ్రంథాన్ని సంయుక్తంగా ఆవిష్కరించారు. అనంతరం మౌనశ్రీ మల్లిక్ మాట్లాడుతూ.. పాశం రెడ్డి కాలానికి నిలిచే అద్భుతమైన కవిత్వం రాసారని అన్నారు. సభలో రచయిత్రి సునీతా రావులపల్లి, చిత్రకారుడు మోషీ, బీపీ పడాల, రామకృష్ణ రచయితను అభినందించారు. పాశం రెడ్డి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం పాశం రెడ్డి మాట్లాడుతూ.. ఇది తన జీవితంలో చిరస్మరణీయమైన రోజు అని అతిథిలకు, నిర్వాహకులకు కృతజ్ఞతలు చెప్పారు. పద్మజా రెడ్డి వందన సమర్పణ చేశారు.

హృదయాన్ని కదిలించేది కవిత్వం

-ప్రముఖ సామాజికవేత్త బిఎస్ రాములు

హైదరాబలాద్, సెప్టెంబర్ 23:వ్యక్తులను సమాజాన్ని మార్చేది, హృదయాన్ని కదిలించేది కవిత్వమని సామాజికవేత్త తెలంగాణ బీసీ కమిషన్ తొలి చైర్మన్ బి.ఎస్ రాములు అన్నారు. భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ మరియు అక్షర కుసుమాలు సుందరయ్య భవన్ ప్రగతినగర్ సయుక్తంగా సెప్టెంబర్ 20 ఆదివారం రోజున సుందరయ్య భవన్ ప్రగతి నగర్ హైదరాబాద్ లో జరిగిన పుస్తకావిష్కరణ సభకు ముఖ్య అతిథిగా హాజరై వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన **"యుద్ధం మొదలైంది"** కవితా సంకలనం మరియు ప్రముఖ కవుల ముందు మాటల సంకలనం **"హృదయ పీఠిక"** రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతుందని ,మత్తు పదార్థాల వల్ల జరిగే నష్టాలను ప్రతిబింబించేలా కవితలు ఉన్నాయని, యువతను మత్తుపదార్థాల నుండి దూరం చేసే దిశగా ఈ కవితలు రచించారని అన్నారు. డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్ రాజు హృదయ పీఠిక పుస్తకాన్ని పరిచయం చేస్తూ ప్రముఖ కవుల హృదయ స్పందనల సమాహారమే ఈ సంకలనమని ,ఈ పుస్తకం ద్వారా పలు గ్రంథాల పరిచయం కలుగుతుందని అన్నారు. ప్రభాకర్ సాహిత్య సేవ, సాహిత్యంలో వెంకటస్వామి నాయుడు మాట్లాడుతూ యుద్ధం మొదలైంది కవితా సంకలనం మత్తు పదార్థాల వారికున్న విస్తృత పరిచయాలను ఈ పుస్తకం తెలుపుతుందన్నారు. నేటినిజం సంపాదకులు బైస దేవదాసు మాట్లాడుతూ కవిత్వం ఆనందాన్ని కలిగించడంతో పాటు ఆలోచింపచేసే విధంగా ఉండాలని అప్పుడే సమాజంలో, వ్యక్తులలో మార్పు సాధ్యమని అన్నారు. పేరు కోసం రాసేది కవిత్వం కాదన్నారు .

మరొక అతిథి సాదనాల వాడకంలో జరిగే నష్టాలను వివరించడమే కాకుండా యువతను పక్కదారి పట్టకుండా చక్కని సందేశాత్మకమైన కవితలతో కూడి ఉన్నదని అన్నారు. సుందరయ్య భవన్ కన్వీనర్ సిహెచ్ మల్లయ్యా చారి సమాజ హితంతో కూడిన పుస్తకాలను ప్రచురిస్తున్న వైరాగ్యం ప్రభాకర్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వనజా బలసాని యుద్ధం మొదలైంది పుస్తకంపై సమీక్ష చేశారు. కార్యక్రమంలో కథ మంచికి చిత్ర దర్శకురాలు నాగశ్రీ బలధారి , తూము నరసయ్య ,మహ్మద్ ఖలీద్, వేము వందనం, డాక్టర్ షహనాజ్ బతుల్ , అనితరాణి కాంచనపల్లి, దొమ్మాట శ్రీకాంత్ గౌడ్, కప్పల అజయ్, రఫూవుద్దీన్, కొండముది పద్మజ, ఈ నవనీత రావు ,ఏరువ వెంకటేశం, కేశరాజు వెంకట ప్రభాకర్ రావు,న్యాలకంటి నారాయణ, జి. కుమార్ రాజు తదితరులు కవితా గానం చేశారు.

పుస్తకావిష్కరణలో వనజా బాలసాని, నాగశ్రీ బాలధార, సాధనాల వెంకటస్వామి నాయుడు, వైరాగ్యం ప్రభాకర్, బి.యస్.రాములు, బైస దేవదాసు, డా॥ కాంచనపల్లి గోవర్ధన రాజు, సి.హెచ్. మల్లయ్య.

చలనచిత్రం నిర్మాణ, దర్శకత్వ బాధ్యతలు వహించిన మొట్టమొదటి మహిళగా శ్రీమతి నాగశ్రీ బాలదారి

శ్రీమతి నాగశ్రీ బాలదారిని సత్కరిస్తున్న అతిథులు.

హైదరాబలాద్, సెప్టెంబర్ 23: అక్షర కుసుమాలు, భవానీ సాహిత్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ ప్రగతి నగర్ సుందరయ్య భవన్ లో జరిగిన కార్యక్రమంలో శ్రీమతి నాగశ్రీ బాలధారిని ఘనంగా సత్కరించారు. తెలంగాణ, ఆంధ్ర విభజన తర్వాత చలనచిత్రం నిర్మాణ, దర్శకత్వ బాధ్యతలు వహించిన మొట్టమొదటి మహిళగా నమోదు కాబోతున్న సందర్భంగా ఆమె కు తొలిసారి హైదరాబాద్లో ఈ సత్కారం జరిగింది. బీసీ కమిషన్ తొలి చైర్మన్ బి.ఎస్. రాములు , నేటి నిజం సంపాదకులు బైస దేవదాసు, తంగేడు పత్రిక సంపాదకులు కాంచనపల్లి గోవర్ధన రాజు, ఆంధ్రప్ర దేశ్ రాష్ట్ర ప్రభుత్వ స్వర్ణ నంది బహు మతి, ఉగాది పురస్కార గ్రహీత, సినీ గీత రచయిత సాదనాల వేంక ట స్వామి నాయుడు, శ్రీ వైరాగ్యం ప్రభాకర్ చేతుల మీదుగా సన్మానం జరిగింది. శ్రీమతి నాగశ్రీ 18 లఘు చిత్రాలకు కథ కథనం, మాటలు అందించి నిర్మాణం చేశారు. తెలంగాణ ఆంధ్ర రాష్ట్రాల లఘు చిత్రాల పోటీలలో అన్ని విభాగాల్లోనూ బహుమ తులు పొందారు. నటిగా 50 కి పైగా లఘు చిత్రాల్లో 15 చిత్రాల్లో నటించారు. రెండు సినిమాలకు డబ్బింగ్ కూడా చెప్పారు. వృత్తిపరంగా ఉపాధ్యాయురాలు.రెండు పీ.జీలు చేశారు. బి.ఇడిలో బంగారు పతకాన్ని పొందారు. అబ్దుల్ కలాంగారి లీడ్ ఇండియా ప్రాజెక్టులోను ఇంపాక్ట్ సంస్థ ద్వారాను అనేక వ్యక్తిత్వ వికాస తరగతులు విద్యార్థినీ విద్యా ర్థులకు నిర్వహించారు.. ప్రభుత్వ పాఠశాలలో యోగ , మెడిటేషన్ తరగతులను కూడా నిర్వహిస్తారు. బంగారుతల్లి ప్రాజెక్ట్‌కు పశ్చిమ గోదావరి జిల్లాకు అంబాసిడర్‌గా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థు కు మోటివేషన్ క్లాసెస్ నిర్వహి స్తున్నారు. సమరసత ఫౌండేషన్ పశ్చిమ గోదావరి జిల్లా కన్వీనర్గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈమెలో ఉన్న మరొక ప్రత్యేకత కూచిపూడి నాట్య కళాకారిణి. రచయిత్రిగా ఈమె రాసిన ఊహలు ఊసులు ,ధ్యానమా... ధ్యానస్థితా... పుస్తకాలు రచించారు . సనాతన ధర్మం, ధ్యానం గురించి చెప్పిన ఉపన్యాసాలు ప్రవచనాలు అంతర్జాల మాధ్య మంలో మనకు కనిపిస్తాయి. పిల్లలకు దూరంగా ఉన్న తల్లిదండ్రులకు తన చల్లని మాటలతో మానసిక ఆనందాన్ని కలగజేస్తారు. బంధువులతోనూ మిత్రుల తోను అజాతశత్రువు అని పిలవబ డే నాగశ్రీ ఒక్క ఆంగ్ల పదము కూడా వాడకుండా అంతర్జాతీయ వేదికపై తెలుగులో ప్రసంగం చేసి ప్రసంగ కిరీటి అనే బిరుదును ఇంటర్నేష నల్ టోస్ట్ మాస్టర్ ద్వారా పొంది ఉన్నారు. ఎన్నో రంగాల్లో విజయాలను సాధించిన శ్రీమతి నాగశ్రీ బాలధారి చలన చిత్ర రంగంలో కూడా విజయం సాధించాలని వక్తలు ఆకాంక్షించారు.

ఆమె దర్శకత్వం వహించిన కత మంచికే చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది.

ఎర్రం (సోమ) లక్ష్మికి కాళోజీ నంది పురస్కారం

పురస్కారం అందుకుంటున్న లక్ష్మి

భువనగిరి కోర్టులో జూనియర్ న్యాయవాదిగా పని చేస్తున్న ఎర్రం (సోమ) లక్ష్మికి కాళోజీ నంది పురస్కారం లభించింది. కాళోజీ తెలంగాణ జూనియర్ లేడీ అడ్వకేట్ అసోసియేషన్,

కాళోజీ తెలంగాణ వికాస సంయుక్త ఆధ్వర్యంలో 2026 సెప్టెంబర్ 9 హనుమకొండలోని జిల్లా పరిషత్ ఆడిటోరి యంలో నిర్వహించిన కార్యక్రమంలో నంది అవార్డు ప్రదానోత్సవం జరిగింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మాధవిదేవిగారి చేతులమీదుగా లక్ష్మి ఈ అవార్డు అందుకున్నారు.

అభినందనలు, ఆశీస్సులు

మామ, అత్త: సోమ రామకృష్ణ సునీత

భర్త: సోమ సాయి కిరణ్

చిన్నత్త: సోమ స్వప్న,
భర్త కీ॥శే॥రాధాకృష్ణ
మరిది:ఎర్రంకృష్ణారావు,
చంద్రకళ
బావ, అక్కలు:
మంచికంటి శ్రీధర్, నాగరాణి
వత్తం శ్రీనాథ్, గీతారాణి
తాతయ్య: **సోమ సీతారాములు**
భువనగిరి, సెల్: 9441703354

తెలుగు గజల్స్ విశ్వవ్యాప్తం కావాలి

పుస్తకావిష్కరణలో అతిథులు

హైదరాబాద్ సెప్టెంబర్ 23: తెలుగు గజల్స్ విశ్వవ్యాప్తం కావాలని పద్మశ్రీ ఎస్వీ యూనివర్సిటీ మాజీ వీ.సి. కొలకలూరి ఇనాక్ అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా గజల్స్ సదస్సు జరిగింది. పి. విజయలక్ష్మి పండిత్ రాసిన హిందీ గజల్స్, బిక్కి కృష్ణ రాసిన హంసిక, భవానీ ప్రకాష్, రాసిన భావనిరాదం, మామిడాల శైలజ రాసిన శిశిర వసంతం పుస్తకాలను కొలకలూరి ఇనాక్ ఆవిష్కరించారు. గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్ రాసిన హృదయతరంగా గజల్స్ పుస్తకాన్ని ఇన్‌కమ్‌ట్యాక్స్ రిటైర్డ్ కమిషనర్ ఎం.నర్సింహప్ప ఆవిష్కరించారు. తెలుగు గజల్స్‌ను విశ్వవ్యాప్తం చేయడానికి వీజీఎఫ్ సంస్థ చేస్తున్న కృషిని పలువురు అభినందించారు. సాహితీ సేవకులు వి.డి. రాజ గోపాల్, గిడుగు క్రాంతికృష్ణ, ఎలవర్తి ధనలక్ష్మికి వీజీఎఫ్ జాతీయ జీవన పురస్కారాలను ప్రదానం చేశారు. ప్రముఖ కవి బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వీజీఎఫ్ అధ్యక్షురాలు పి. విజయలక్ష్మి పండిత్, కోగంటి ఉషారాణి, ఎం.రాజేశ్వరి, వహీద్, రాం శర్మ, రఘువీర్ ప్రసాద్, వీరభద్రబాబు, కే, శాంతిశ్రీ, స్వర్ణలత పాల్గొన్నారు.

గడియారం వేంకట శేషశాస్త్రి పురస్కార ప్రదానోత్సవం

పద్యకవి ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణకు పురస్కారం ప్రదానం చేస్తున్న అతిథులు.

హైదరాబాద్, సెప్టెంబర్ 24:(నేటినిజం ప్రతినిధి): శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయం సౌజన్యంతో ఎం.వి. ఆర్. ఫౌండేషన్ నిర్వ హణలో రచన సాహిత్య వేదిక, గడియారం కుటుంబీకుల సంయుక్తాధ్వర్యంలో ఆదివారం సాయంత్రం భాషా నిలయం ఆడిలోరియంలో మహాకవి డాక్టర్ గడియారం వేంకట శేష శాస్త్రి 45వ సాహిత్య పురస్కారం ప్రదానోత్సవ కార్యక్రమం సాహిత్యాభిమానుల మధ్య ఆదివారం ఘనంగా జరిగింది.

డాక్టర్ గడియారం వేంకట శేషశాస్త్రి సాహిత్య పురస్కారాన్ని పద్యకవి ఆచార్య అప్పాజోస్యుల సత్యనారా యణకు ప్రదానం చేసి సత్కరించారు.

పురస్కారం కింద పదివేల రూపాయల నగదు, జ్ఞాపిక, నూతన వస్త్రాలను బహూకరించారు. తెలుగు వర్సిటీ పూర్వ వీసీ ఆచార్య అనుమాండ్ల భూమయ్య, సాహితీవేత్తలు విహారి, డాక్టర్ రేవూరి అనంతపద్మనాభరావు, గుత్తికొండ సుబ్బారావు, ఎం. జానకీరామ్, సుధామ, ఏల్చూరి మురళీధర్, ధూళిపాక అరుణ పాల్గొని పురస్కార గ్రహీత అప్పాజోస్యుల పద్యకవితా వైభవం గురించి ప్రసంగించారు.

శివభారతం రచనను ఉదహరిస్తూ వక్తలు వేంకట శేషశాస్త్రికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గడియారం వెంకటశేషశర్మ, భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, అన్నవరం రాజకుమార్, ఎం. వి.ఆర్. ఫౌండేషన్ అధ్యక్షులు మట్టిగుంట వెంకటరమణ పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.